www.vishalabharati.com
epaper:vishalabharati.com

గురువారం, హైదరాబాద్
05 అక్టోబర్ 2023
సంపుటి:1 సంచిక:355

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



## అట్టహాసంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

- సందడి చేసిన ప్రముఖ సినీ నటి కృతిశెట్టి





# సీటు నో గ్యారంటీ!

- బీఆర్ఎస్ ఫస్ట్ లిస్టులో పలు మార్పులకు రంగం సిద్ధం
- ఆఖరి నిమిషంలో అభ్యర్థులను మార్చే ప్లాన్‌లో గులాబీ బాస్
- ఆ 5 స్థానాల్లో క్యాండిడేట్ల ప్రచారానికి గ్రీన్ సిగ్నల్
- అసంతృప్తితో ఇతర పార్టీలవైపు జారుకుంటున్న లీడర్లు
- కేటీఆర్, హరీశ్ బుజ్జగింపులకు తలొగ్గని సిట్టింగులు

"బీఆర్ఎస్‌మొత్తం 119 స్థానాలకు గాను, 114 స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. మిగతా ఐదు స్థానాల్లో ఎవరిని ప్రకటించకుండా సస్పెన్స్‌లో పెట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మిగిలిన స్థానాలకు కూడా అభ్యర్థులను ఖరారు చేసేసింది. ఈ మేరకు ఆయా అభ్యర్థులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో వారు నియోజకవర్గంలో ప్రచారం కూడా షురూ చేశారు. డిసెంబర్‌లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థుల జాబితాను అందరి కంటే చాలా ముందుగా పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. మిగిలిన పార్టీలేవీ ఇప్పటి వరకూ అభ్యర్థులను ప్రకటించలేదు. అందరి కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్ ఎన్నికల ప్రచారానికి తెరలేపారు. ఆపార్టీ నుంచి కేటీఆర్, హరీశ్ రావు, కవితలు రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేస్తూ.. తమకే ఓటు వేయాలని కోరుతున్నారు.

**విశాల భారతి, హైదరాబాద్:**

బలం లేని చోటు.. ఇతర పార్టీ నేతలకు గాలం జనగామ సీటు తనకే పక్కా అని ఇప్పటికే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రచారం స్టార్ట్ చేశారు. ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో సమావేశాలతో బిజీ బిజీగా గడుపుతున్నారు. దీంతో అక్కడ ఉన్న సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డికి పల్లాకు మధ్య కోల్డ్ వార్ నడుస్తున్నది. అయితే వారిని సముదాయించేందుకు మంత్రి కేటీఆర్ రంగంలోకి దిగడంతో వారి మధ్య సయోధ్య కుదిరించే ప్రయత్నం జరిగిందని తెలుస్తోంది. ఇక మెదక్ లోని నర్సాపూర్ స్థానంలో ఎమ్మెల్యే మదన్ రెడ్డికి బదులు.. కాంగ్రెస్‌ను వీడి కారెక్కిన సునీత లక్ష్మారెడ్డికి దాదాపుగా ఖరారు చేసినట్లు తెలుస్తోంది. మల్కాజిగిరిలో ఇంతకు ముందే మైనంపల్లి హన్మంతరావు రాజీనామా చేయడంతో ఆ స్థానంలో మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డికి టికెట్ ఫైనల్ చేశారు. ఆయన భారీ ర్యాలీతో ప్రచారం మొదలుపెట్టేశాడు. మరోవైపు గోషామహల్‌లో బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఉన్న నందకిశోర్ వ్యాస్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తున్నది. మరోవైపు నాంపల్లికి మాత్రం కాంగ్రెస్ అభ్యర్థిని ఖరారు చేశాకే అభ్యర్థిని ప్రకటించే యోచనలో అధికార పార్టీ ఉంది. ఇక్కడ బలమైన సొంత నేత లేకపోవడంతో వలస నేతపై ఆధారపడనున్నది. ముఖ్యంగా గతంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఎంఐఎం అభ్యర్థి చేతిలో స్వల్ప ఓట్లతో ఓటమి పాలైన ఫిరోజ్ ఖాన్‌కు ఈ సారి కాంగ్రెస్ నుంచి టికెట్ రాకుంటే.. కారు ఎక్కించుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

**ముదిరాజుల ఓట్ల కోసం ఆరాటం**

ఇదిలా ఉండగా.. ఇప్పటికే ప్రకటించిన తొలి జాబితాలోనూ స్వల్ప మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేరునే హైకమాండ్ ప్రకటించింది. ఈసారి తనకే టికెట్ రావాలని తీవ్ర ప్రయత్నం చేసిన చిట్కుల్ సర్పంచ్ నీలం మధు.. అసమ్మతి గళం ఎత్తుకున్నారు. దీంతో అధిష్టానం మరో ఆలోచన చేస్తున్నదని సమాచారం. ఎందుకంటే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 50- 60 లక్షల ముదిరాజ్ ల ఓట్లు ఉన్నాయి. దీంతో గులాబీ బాస్ మరో ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీసీలకు తక్కువ సీట్లు కేటాయించిన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో నీలం

..మిగతా | 2 | లో



## నమ్మితేనే ఓట్లు వేయండి.. లేకుంటే లేదు..

- తొమ్మిదిన్నరేళ్లలో ఏం చేశామో చెప్పగలిగే స్థితిలో మేం ఉన్నాం
- కాంగ్రెస్ 65 ఏళ్ల పైబడి చరిత్రలో ఏం చేశారో చెప్పేస్థితిలో ఉందా
- నిర్మల్ సభలో కాంగ్రెస్ పై తీవ్ర విమర్శలు
- లక్ష్మీనరసింహ ఎత్తిపోతల పథకం ప్రారంభం
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

**హైదరాబాద్,విశాలభారతి:**

రాష్ట్రంలో బీఆర్ఎస్ అభివృద్ధి చేసిందని నమ్మితేనే ఓట్లు వేయండని.. లేకుంటే లేదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తేల్చి చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ. 714 కోట్ల వ్యయంతో దిలావర్పూర్లో లక్ష్మీనరసింహ ఎత్తిపోతల పథకాన్ని కేటీఆర్ ప్రారంభించారు. అనంతరం మాడేగాం పంపుహౌస్ వద్ద మంత్రి ఇంద్రకరణ్రెడ్డితో కలసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే నిర్మల్ జిల్లాలో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత నిర్మల్లోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కేటీఆర్ పాల్గొని.. కాంగ్రెస్పై విమర్శలు కురిపించారు. తొమ్మిదిన్నరేళ్లలో ఏం చేశామో చెప్పగలిగే స్థితిలో ఉన్నామని.. అదే కాంగ్రెస్ 65 ఏళ్ల పైబడి చరిత్రలో ఏం చేశారో చెప్పేస్థితిలో ఉందానని మంత్రి కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. 70 ఏళ్ల వయస్సులోనూ ఇంద్రకరణ్ రెడ్డి హుషారుగా పని చేస్తున్నారని కేటీఆర్ కొనియాడారు. నాలుగు జిల్లాల కోసం ఇంద్రకరణ్రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. నిర్మల్ జిల్లాలో 300 మందికి ఉపాధినిచ్చే పామాయిల్ ఫ్యాక్టరీని ప్రారంభించుకున్నామని తెలిపారు. మన కలెక్టరేట్ల మాదిరిగా చాలా రాష్ట్రాల్లో సెక్రటేరియట్లు కూడా ఉండవన్నారు.

జిల్లాకొక మెడికల్ కాలేజీ వస్తుందని ఎప్పుడైనా అనుకున్నామా.. కానీ ఇప్పుడు సుమారు 23 మెడికల్ కళాశాలలు వచ్చాయని హర్షించారు. ఎంత పెద్ద జబ్బు అయినా.. జిల్లా ఆస్పత్రుల్లోనే చికిత్సలు అందుతున్నాయని చెప్పారు. ఆరున్నర లక్షల మంది విద్యార్థులకు గురుకులాల్లో విద్య అందిస్తున్నామని స్పష్టం చేశారు. రూ.714 కోట్లతో దిలావర్పూర్లో లక్ష్మీనరసింహ ఎత్తిపోతల పథకం ప్రారంభంతో.. 50 వేల ఎకరాలకు నీరందుతుందని అన్నారు. "మంచిగా ఒక 30 బస్సులు ఏర్పాటు చేస్తాను. మొత్తం నిర్మల్ జిల్లాలో ఉన్న కాంగ్రెస్ నాయకులు అందరూ.. 30 బస్సులు ఎక్కండి. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు చేరే 15 బస్సులు ఎక్కండి. ఏ ఊరు పోతారో పోండ్రి. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో.. రాష్ట్రవ్యాప్తంగా ఏ ఊరు పోతారో పోండ్రి.. ఏ టైంకు పోతారో పోండ్రి. అందరూ లైన్గా నిలబడి కరెంటు తీగలను

..మిగతా | 2 | లో



## కెసిఆర్ కాంగ్రెస్‌కు ఫండింగ్ చేస్తుండు

- 15 రోజుల నుంచి కేసీఆర్ కనిపించటంలేదు
- సీఎం హెల్త్ బులిటెన్ బయటపెట్టాలి
- నిజామాబాద్ ఎంపీ అర్వింద్

**హైదరాబాద్, విశాలభారతి:** తొలిసారిగా ఎంపీగా రైతుల దశాబ్దాల కల నెరవేర్చినందుకు ఆనందంగా ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పసుపు బోర్డు ప్రకటనను బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారని ఎద్దేవా చేశారు. గిరిజన విశ్వవిద్యాలయం ఆలస్యానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఎంపీ ఆరోపించారు. గత 15 రోజుల నుంచి ముఖ్యమంత్రి కేసీఆర్ కనిపించటంలేదని..సీఎం హెల్త్ బులిటెన్ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. సీఎం ఆరోగ్యం ఎలా ఉందో చెప్పాలని అర్వింద్ డిమాండ్ చేశారు. మోదీ, కేసీఆర్ మాట్లాడుకున్నవి కేటీఆర్‌కు ఎలా తెలుసని ప్రశ్నించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ రోజు రోజుకు మునిగిపోతుందన్నారు. ప్రధానమంత్రి వస్తున్నారంటే సీఎంకు కన్ను, పంటినొప్పి, జ్వరం వస్తుందని ఎద్దేవా చేశారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డిని ఎందుకు జైల్లో వేయడం లేదని ప్రశ్నించిన ఆయన... బీఆర్ఎస్ కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని ఈ విషయంలోనే తెలుస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌లో చేర్పిస్తుంది కేసీఆరేనని అన్నారు.



## గులాభి గూటికి నందికంటి

- కాంగ్రెస్ పార్టీకి శ్రీధర్ రాజీనామా

**హైదరాబాద్,విశాలభారతి:** మేడ్చల్ జిల్లా మాజీ డీసీసీ ప్రెసిడెంట్ నందికంటి శ్రీధర్ గూలాబీ గూటికి చేరారు.బుధవారం సాయంత్రం ప్రగతి భవన్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ పార్టీ మైనంపల్లి హన్మంతరావుకి మల్కాజిగిరి టికెట్ ఇస్తున్నట్లు స్పష్టంచేయడంతో.. నందికంటి శ్రీధర్ ఆ పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. నందికంటి రాజీనామా చేసిన తర్వాత మల్కాజ్‌గిరి, అల్వాల్ సర్కిళ్లకు చెందిన అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల బాధ్యులు నందికంటి శ్రీధర్‌కు మద్దతుగా మంగళవారం ముకుమ్మడి రాజీనామాలు చేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామాలు చేసిన వారంతా నందికంటితో పాటే బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కేటీఆర్

..మిగతా | 2 | లో

## కృష్ణా జలాల సమస్య పరిష్కారమవుతుందని ఆకాంక్షిస్తున్నా

- నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతోనే తెలంగాణ ఉద్యమం వచ్చింది
- ప్రధానికి తెలుగు రాష్ట్రాల తరపున ధన్యవాదాలు
- బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి



..మిగతా | 2 | లో



## లాగ్ బుక్ లు తీసుకొచ్చి.. 24 గంటల కరెంట్ నిరూపించు

- ప్రజల కోసం కరెంట్ తీగలను పట్టుకునేందుకు రెడీ
- కేటీఆర్ కి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్
- రెండు రోజుల్లో టికెట్లు కన్ఫామ్.. 'గుట్ట' నుంచి ప్రచారం ప్రారంభిస్తా

**విశాల భారతి, హైదరాబాద్:**

తెలంగాణ మంత్రి కేటీఆర్ కు కాంగ్రెస్ పార్టీ స్టార్‌క్యాంపెయినర్ , భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సవాల్ విసిరారు. లాగ్ బుక్ లు తీసుకువచ్చి 24 గంటల కరెంట్ ఇస్తున్నట్లు నిరూపించాలని డిమాండ్‌చేశారు. బుధవారం ఆలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కొమ్మిశెట్టి నర్సింలు, సింగిల్ విండో వైస్ చైర్మన్ వంగాల కృష్టయ్య ,మాజీ సర్పంచ్ ఓంకార్ గౌడ్ తో పాటు కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్‌నాయకులకు కోమటిరెడ్డి 'హస్తం' కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్‌వ్యాఖ్యలపై స్పందిస్తూ రాష్ట్ర ప్రజల కోసం కరెంట్ తీగలను పట్టుకోవడానికి తాను సిద్ధమని కోమటిరెడ్డి పేర్కొన్నారు. గృహలక్ష్మి పేరుతో రూ.3 లక్షలు ఇస్తానన్న కేసీఆర్ హామీని గాలికి వదిలేశారని ఆరోపించారు. కేసీఆర్ ప్రకటించిన పథకాలన్నీ కేవలం

..మిగతా | 2 | లో

## కానిస్టేబుల్ తుది ఫలితాలు విడుదల

### పోలీసు నియామక మండలి ప్రకటన

**హైదరాబాద్,విశాలభారతి:** తెలంగాణలో కానిస్టేబుల్ నియామక పరీక్ష తుది ఫలితాలు విడుదలయ్యాయి. తుది ఫలితాలను పోలీసు నియామక మండలి

..మిగతా | 2 | లో



# కేసీఆర్ నైజం బయటపడింది

- మోదీపై విమర్శలు రెండు నాలుకల ధోరణికి నిదర్శనం
- ఓటమి భయంలో బీఆర్ఎస్ నేతలు
- బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్

**హైదరాబాద్,విశాలభారతి:** ప్రధాని నరేంద్ర మోదీపై బీఆర్ఎస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్ మండిపడ్డారు. హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. మోదీపై విమర్శలు కేసీఆర్ రెండు నాలుకల ధోరణికి నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నైజం ఇప్పుడు పూర్తిగా బయటపడిందని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే బీఆర్ఎస్ నేతలు ఇలా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేసీఆర్ గజకర్ణ, గోకర్ణ విద్యలు ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. మిషన్ భగీరథ ప్రారంభానికి వచ్చిన మోదీనీ ఆనాడు కేసీఆర్ పొగిడారని తెలిపారు. పన్ను ఆదాయంతో రాష్ట్రాల వాటా పెంచారని మోదీని కేసీఆర్ పొగిడినట్లు గుర్తు చేశారు. కేసీఆర్ ఏ విషయాన్నైనా ప్రజలను నమ్మించే నైపుణ్యవంతుడని ఎద్దేవా చేశారు. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని బీజేపీ మేనిఫెస్టోలో పెట్టలేదు కానీ రైతుల సంక్షేమం కోసం మూతపడ్డ రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని కేంద్రం పునఃప్రారంభించిందని గుర్తుచేశారు.
రాష్ట్రంలో కేంద్రం బియ్యం ఇస్తే మోదీ ఫొటో పెట్టకుండా.. కేసీఆర్ ఫొటో పెట్టుకున్నారని ఈటల రాజేందర్ మండిపడ్డారు. తెలంగాణ ప్రజల గుండెల్లో మీ ఫొటో ఉండదు.. వారిలో చిరస్థాయిలో నిలిచిపోయేది ప్రధాని మోదీ మాత్రమే నన్నారు. గృహలక్ష్మి పథకంలో భాగంగా ఇళ్లు మంజూరు అవుతాయా..? డబ్బులు వస్తాయా అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ మాటలు నమ్మితే మోసపోతారని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రాష్ట్రానికి ప్రధాని వస్తే టూరిస్ట్ అంటున్నారు.. కానీ వీరు మాత్రం బీఆర్ఎస్ పేరుతో కేసీఆర్ ఇతర రాష్ట్రాల్లో తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ప్రగతిభవన్ వారికి అధికారిక నివాసం, పార్టీ కార్యాలయం కాదని అందులో ఇతర రాష్ట్రాల వారికి కండువాలు కప్పుతున్నారని విమర్శించారు. మంత్రి కేటీఆర్ ప్రధానిని చీటర్ అన్నారు.. కానీ ఇచ్చిన హామీలను విస్మరించిన వారు పెద్ద చీటర్ అంటూ ఈటల హితవు పలికారు. దళిత ముఖ్యమంత్రి, దళిత బంధు, మూడెకరాల భూమి ఇస్తామని చెప్పింది ఎవరు అంటూ ప్రశ్నించారు.



మీకే నిఘా వ్యవస్థ ఉంటే.. ప్రధానికి ఉండదా అని ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఏ ఆధారాలు లేకుండా మాట్లాడరని... సమయం వచ్చినప్పుడు అన్ని బయటపడతాయని వివరించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ జయకేతనం ఎగురవేస్తుందని.. కేసీఆర్ ఇక ఫామ్హౌస్కే పరిమితం అవక తప్పదని ఈటల జోస్యం చెప్పారు.



# అట్టహాసంగా సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

- సందడి చేసిన ప్రముఖ సినీ నటి కృతిశెట్టి

**విశాలభారతి, హైదరాబాద్:** ఉప్పల్ లో బస్ స్టాప్ సమీపంలో ఏర్పాటు చేసిన నూతన సీఎంఆర్ షాపింగ్ మాల్ ను రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి , సీఎంఆర్ చైర్మన్ మావూరి వెంకటరమణ, నటుడు శివారెడ్డిలతో కలిసి సినీ నటి కృతిశెట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా కృతిశెట్టి మాట్లాడుతూ నలభై ఏండ్లుగా 'సీఎంఆర్ షాపింగ్ మాల్ నిర్వాహకులు కస్టమర్ల అభిమానాన్ని చూరగొన్నారని చెప్పారు. ఉప్పల్ లో మరొక మాల్ ను ప్రారంభించడం ఆనందంగా ఉందనీ, రానున్న బతుకమ్మ , దసరా, దీపావళి పండుగల కోసం సీఎంఆర్ మాల్ పేద, మధ్య తరగతి వారి కోసం మంచి కలెక్షన్స్ ను అందుబాటు ధరలలో ఏర్పాటు చేశారని, వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ లో అభిమానుల మధ్య సినీ నటి కృతిశెట్టి సందడి చేశారు. ప్రస్తుతం తెలుగు, తమిళం, మలయాళం సినిమాల్లో నటిస్తున్నానని కృతిశెట్టి ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం సీఎంఆర్ ఫౌండర్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి విభిన్న వస్త్రాలు ఉప్పల్‌లో లభిస్తాయని అన్నారు. ప్రజలంతా షాపింగ్ మాల్ వచ్చి తమకు కావాల్సిన ఐటమ్స్ అతి తక్కువ ధరలకు పొందేలా సీఎంఆర్ సేవలందిస్తుందని తెలిపారు. సీఎంఆర్ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ.. ఉప్పల్‌లో షాపింగ్‌మాల్‌ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. సీఎంఆర్ అంటే 'ది వన్ స్టాప్ షాప్' అని ఫ్యామిలీలో అందరికీ నచ్చే విధంగా అన్ని రకాల స్టైల్స్, డిజైన్స్ లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, సినీ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# లాగ్ బుక్ లు తీసుకొచ్చి.. 24 గంటల కరెంట్ నిరూపించు

మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ కార్యకర్తలకు మాత్రమేనని విమర్శించారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ , బీజేపీ ఒక్కటేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ఇచ్చే డబ్బులకు ఆశపడొద్దని ప్రజలంతా ఆలోచించి ఓటు వేయాలని కోమటిరెడ్డి సూచించారు. తెలంగాణ ఇచ్చిన సోనియమ్మ చెప్పిన ఆరు గ్యారంటీలు చిన్న పథకాలే అయిన ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. '60 రోజులు మీరు కష్టపడి కాంగ్రెస్ ను గెలిపించండి. ఆలేరు నియోజకవర్గానికి మొదటి ప్రాధాన్యం ఇస్తాం. ఆలేరు లో సాగునీటి ప్రాజెక్ట్ లను పూర్తి చేస్తాం. బీర్ల ఐలయ్య కు అందరు సహకరిస్తున్నారు. ఆలేరు కు ఎమ్మెల్యే కంటే నేను ఎక్కువ సార్లు వచ్చాను. ఎమ్మెల్యే అంటే కార్లు వేసుకొని తిరగడం కాదు.. పేదోడి కష్టం తీర్చాలి. ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలు వాస్తవం.. కానీ ఇప్పటికీ బీఆర్ఎస్- బీజేపీ ఒకటే. కేసీఆర్ బండారం మోడీ బయట పెట్టాడు. సబ్ స్టేషన్ లో లాగ్ బుక్ లు పెట్టండి. 24గంటల కరెంట్ ఇచ్చినట్లు రుజువైతే తాము కరెంట్ తీగలను పట్టుకుంటాం. తెలంగాణ కోసం మంత్రి పదవిని వదులుకున్న వ్యక్తిని నేను. పార్టీలు మారితేనే పదవులు ఇస్తామని ప్రలోభాలకు గురిచేస్తున్నారు. మరో రెండు రోజుల్లో కాంగ్రెస్ లో టికెట్లు కన్ఫామ్ అవుతాయి. యాదగిరి గుట్ట నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తాను. అవసరం లేకున్న ఈ వాస్తు లేదని కొత్త సచివాలయం కట్టించారు కేసీఆర్. అన్ని వర్గాల కు సమానంగా కాంగ్రెస్ మేనిఫేస్టో ఉంటుంది. కాంగ్రెస్ డబ్బులతో పోటీ పడలేదు కానీ పథకాలతో పోటీ పడుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పథకాలు అమలవుతాయి. పథకాలు అమలు కాకపోతే.. నా పదవులకు రాజీనామా చేస్తా' అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. 'బీఆర్ఎస్ ఇచ్చే డబ్బులకు ఆశ పడకండి. ప్రజలరా ఆలోచించి ఓటు వెయ్యండి.' అని వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# గులాభి గూటికి నందికంటి

మొదటిపేజీ తరువాయి

నిర్మల్ పర్యటనలో ఉన్నారు. నిర్మల్ పర్యటన ముగించుకుని హెలి కాప్టర్‌లో కేటీఆర్ నగరానికి చేరుకున్న వెంటనే నందికంటిని పార్టీకి ఆహ్వానిస్తూ.. గులాబీ కండువా కప్పనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. బీఆర్ఎస్‌లోకి నందికంటి చేరికతో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తప్పదని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే త్వరలోనే నందికంటికి బీఆర్ఎస్ కీలక పదవి కట్టబెట్టే అవకాశం ఉందని తెలిసింది.

# కానిస్టేబుల్ తుది ఫలితాలు విడుదల

మొదటిపేజీ తరువాయి

ప్రకటించింది. ఈ మేరకు 15,750 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల ఎంపిక జాబితాను వెల్లడించింది. పోస్టుల వారీగా ఎంపికైన అభ్యర్థుల జాబితాలో 12,866 మంది పురుషులు, 2884 మంది మహిళలు ఉన్నారు. అభ్యర్థుల ఎంపికకు సంబంధించిన పూర్తి వివరాలు అక్టోబర్ 5 ఉదయనికల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. కోర్టులో కేసు పెండింగ్ అంశాల నేపథ్యంలో పీటీవోలో 100 డ్రైవర్ పోస్టులు, డీఆర్ అండ్ ఫైర్ సర్వీసెస్ విభాగంలో నోటిఫై చేసిన 225 ఖాళీలకు సంబంధించి ఎంపికైన వారి వివరాలను విడదుల చేయనున్నట్లు తెలిపింది. ఎంపికైన అభ్యర్థుల పూర్తి ఫలితాలు, కటాఫ్ మార్కులు (ఎంపికైన తుది అభ్యర్థుల మార్కులు పుట్టిన తేదీ వివరాలతో) గురువారం ఉదయనికల్లా అందుబాటులో ఉంచనున్నట్లు టీఎస్ఎల్పీఆర్బీ వెల్లడించింది. రాష్ట్రంలో ఖాళీగా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రిక్రూట్‌మెంట్ గతేడాది నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. స్పెషల్ పోలీస్, సివిల్ పోలీస్, ఏఆర్ తదితర విభాగాల్లో ఈ పోస్టులు ఉన్నాయి. పోస్టులకు సంబంధించి దరఖాస్తు ప్రక్రియ స్వీకరించి, విడతల వారీగా పరీక్షలు నిర్వహించింది.

# సీటు నో గ్యారంటీ!

మొదటిపేజీ తరువాయి

మధుకు పార్టీలో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ లు వస్తున్నాయి. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**కిషన్ రెడ్డికి చెక్ పెట్టేందుకు సిట్టింగ్ ను మార్చుతారా?**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించినే అంబర్‌పేట్ స్థానంలో సైతం బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేరు మార్పు అంటూ ప్రచారం ఊపందుకున్నది. బీజేపీ నుంచి అంబర్‌పేట్ స్థానం ఆశించి భంగపడ్డ గ్రేటర్ మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, ఆయన సతీమణి, అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మా వెంకట్ రెడ్డిలు ఇటీవల బీఆర్ఎస్‌లో చేరారు. అక్కడ కిషన్ రెడ్డిని ఢీకొట్టాలంటే వెంకట్ రెడ్డికి టికెట్ ఇవ్వడమే మేలనే ఆలోచనలో బీఆరెస్ నేతలు ఉన్నట్లు సమాచారం. ఇక బీఆరెస్‌లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తగిన ప్రాధాన్యం ఇస్తూ టికెట్లు ప్రకటిస్తామని ఏ పార్టీ భరోసా ఇస్తే అందులో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇలా చేరే వారిలో పలు నియోజకవర్గాల్లో సెకండ్ క్యాడర్ నేతలు చాలా మంది ఉన్నట్లు సమాచారం. మరోవైపు తమకు బలం లేని కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలోని ముఖ్యనేతలకు అధికార పార్టీ గాలం వేస్తోందని తెలుస్తున్నది. తమ పార్టీలో వచ్చే రాబోయే రోజుల్లో తగిన ప్రాధాన్యత ఇస్తామని హామీలు ఇస్తున్నట్లు సమాచారం. గట్టి నేతలకు గట్టిగా ప్యాకేజీలు కూడా ఆఫర్ చేస్తుందని సమాచారం.

# నమ్మితేనే ఓట్లు వేయండి.. లేకుంటే లేదు..

మొదటిపేజీ తరువాయి

పట్టుకొండి.. కరెంటు వస్తుందో రాదో మీకే తెలుస్తుంది. రాష్ట్రానికి కూడా దరిద్రం వదిలిపోతుంది." అని కేటీఆర్ అన్నారు. అంతకు ముందు హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో దిలావార్పూర్ మండలం గుండంపల్లికి చేరుకున్న మంత్రి కేటీఆర్కి.. ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. మొదట కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.714 కోట్ల వ్యయంతో చేపట్టిన లక్ష్మీనరసింహస్వామి ఎత్తిపోతల పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి.. అనంతరం రూ.24 కోట్లతో నిర్మల్లో ఇంటింటికీ నల్లానీటి సరఫరాను ప్రారంభించారు. సోమ్ మండలం పాతపోచంపాడ్లో రూ.250 కోట్ల వ్యయంతో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి బహిరంగ సభలో పాల్గొన్నారు.




# చంద్రబాబు అరెస్ట్ బాధించింది

- మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు బాధాకరం
- విచారణ పేరిట 26 రోజులుగా ఇబ్బందులా
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్,విశాలభారతి:** చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో తాజా పరిణామాలపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పందించారు. అధికార బలంతో మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడ్ని అరెస్టు చేయడం చాలా బాధాకరమని తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వ్యక్తిగతంగా తనకెంతో బాధ కలగచేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన సీనియర్ నేత చంద్రబాబు పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విచారకరం అని వ్యాఖ్యానించారు. 73 ఏళ్ల వయసులో ఉన్న బాబును అరెస్ట్ చేయడం, విచారణ పేరిట 26 రోజులుగా ఇబ్బందులకు గురిచేయడం ఏ మాత్రం సరికాదని అన్నారు. కనీసం ఆయన హోదా, వయస్సుకైనా సరే గౌరవం ఇవ్వాల్సిందని.. విచారణ అంటే సరైన పద్ధతులు ఉంటాయని చెప్పారు. పెద్ద నేత అరెస్ట్ అంటే ఓ ప్రొసీజర్ ఉంటుందని.. ఈ విషయంలో ఏదీ కూడా పాటించడం లేదని.. ఇది సరైన పద్ధతి కాదని ఆక్షేపించారు. అధికారం ఉంది కదా అని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తామంటే అంటే ఎలా కుదురుతుంది..? ఇవాళ అధికారం ఉంటుంది.. రేపు మరొకరు అధికారంలో వస్తారు.. అప్పుడేంటి పరిస్థితి అని సూటిగా ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయకత్వంలో తాను మంత్రిగా పనిచేశానని మంత్రి తలసాని పేర్కొన్నారు.
"మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని అరెస్టు చేయడం చాలా బాధాకరం. అధికారం శాశ్వతం కాదు. ఒకప్పుడు కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చంద్రబాబు పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు విచారకరం. విచారణ పేరిట 26 రోజులుగా ఇబ్బందులకు గురి చేయడం ఏ మాత్రం సరికాదు. కనీసం ఆయన హోదా, వయస్సుకైనా గౌరవం ఇవ్వాల్సింది". అని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. చంద్రబాబు అరెస్ట్పై మంత్రి హరీశ్రావు స్పందించారు. ఈ వయసులో చంద్రబాబును అరెస్టు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాజకీయాల్లో కక్ష సాధింపు చర్యలు మంచివి కావని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, పోచారం శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఉద్దేశపూర్వకంగా అరెస్ట్ చేశారని దుయ్యబట్టారు. అంతకు ముందు తెలంగాణ బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, లక్ష్మణ్ కూడా చంద్రబాబు అరెస్టును ఖండించారు. అలాగే తెలంగాణ కాంగ్రెస్ నుంచి భట్టి విక్రమార్క స్పందించారు.

# ఒక వర్గానికే కొమ్ము కాస్తే ఊరుకునే ప్రసక్తే లేదు

- బీఆర్ఎస్ పార్టీ హిందూ మనోభావాలను దెబ్బ తీస్తుంది
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



**హైదరాబాద్,విశాలభారతి:** అధికార బీఆర్ఎస్ పార్టీ హిందూ మనోభావాలను దెబ్బ తీస్తూ ఒక వర్గానికి మాత్రమే కొమ్ము కాస్తే ఊరుకునే ప్రసక్తే లేదని కచ్చితంగా మందలిస్తామని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ హెచ్చరించారు. కరీంనగర్ శివారులో ఓ వర్గం వారికి ఎనిమిది ఎకరాల స్థలం కేటాయించడంపై తప్పు పట్టారు. సదరు వర్గానికి ప్రభుత్వం కేటాయించిన ఎనిమిది ఎకరాల స్థలాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న హిందూ దేవాలయాలను పట్టించుకోకుండా.. ప్రభుత్వము కేవలం ఒకరికి మాత్రమే కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్లో గురుద్వార్, మేదరి సంఘం కమ్యూనిటీ భవనాన నిర్మాణానికి భూమి పూజ చేశారు. హిందూ మనోభావాలను దెబ్బతీస్తే కచ్చితంగా మాట్లాడవలసి తీరుతుందని, తగిన గుణపాఠం చెబుతామని అధికార పార్టీ నాయకులను హెచ్చరించారు

# కృష్ణా జలాల సమస్య పరిష్కారమవుతుందని ఆకాంక్షిస్తున్నా

**హైదరాబాద్,విశాలభారతి:**



కృష్ణా జలాల్లో వాటా తేల్చాలని తెలంగాణ కోరుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం, తెలంగాణ మధ్య చర్చలు జరిగాయని అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతోనే తెలంగాణ ఉద్యమం వచ్చిందని గుర్తు చేశారు. జల వివాదాలు పరిష్కరించిన కేంద్ర ప్రభుత్వానికి దిల్లీలో కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత ట్రైబ్యునల్‌కు ప్రత్యామ్నాయం ఏర్పాటుపై చర్చ జరిగిందని వివరించారు. ఈ క్రమంలో 2021లో రిట్ పిటిషన్‌ను తెలంగాణ ఉపసంహరించుకుందని కిషన్‌రెడ్డి తెలిపారు. సమస్య పరిష్కరించాలని రెండు రాష్ట్రాలు కేంద్రాన్ని కోరాయని చెప్పారు. రెండు రాష్ట్రాలతో కేంద్రం అనేకసార్లు మాట్లాడిందని గుర్తు చేశారు. సొలిసిటర్ జనరల్ అభిప్రాయాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకుందని అన్నారు. సొలిసిటర్ జనరల్ 2023 జులైలో న్యాయశాఖకు నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు. ట్రైబ్యునల్‌లో అదనపు నిబంధనలు చేర్చాలని నిర్ణయించారని కిషన్రెడ్డి వెల్లడించారు.
సెక్షన్ 12కు అదనపు నిబంధనలు చేర్చి సమస్య పరిష్కరించుకోవచ్చని సూచించారని కిషన్రెడ్డి వివరించారు. ఈ సెక్షన్కు అదనపు నిబంధనలు చేర్చి సమస్య పరిష్కరించాలని కేంద్రం నిర్ణయించిదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సమస్య పరిష్కారమవుతుందని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రధానికి తెలుగు రాష్ట్రాల తరపున ధన్యవాదాలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణలో కేంద్రం గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తోందని కిషన్రెడ్డి వివరించారు. తెలంగాణలో 9.08 శాతం మంది గిరిజనులు ఉన్నారని కిషన్రెడ్డి తెలిపారు. 2011 గణాంకాల ప్రకారం గిరిజన అక్షరాస్యత 49.51 శాతం అని అన్నారు. కేంద్ర విద్యాశాఖ ద్వారా రూ.889 కోట్లతో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు.. తద్వారా తెలంగాణలోని గిరిజనులకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. విశ్వవిద్యాలయం ద్వారా గిరిజనుల హక్కులు, సంస్కృతి పరిరక్షణకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. గిరిజన యూనివర్సిటీకి సమ్మక్కసారక్కగా నామకరణం చేశామని.. కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు చేయడం సంతోషకరమని కిషన్రెడ్డి వ్యాఖ్యానించారు.
"కృష్ణా జలాల్లో వాటా తేల్చాలని తెలంగాణ కోరుతోంది. కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం, తెలంగాణ మధ్య చర్చలు జరిగాయి. నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతోనే తెలంగాణ ఉద్యమం వచ్చింది. జల వివాదాలు పరిష్కరించిన కేంద్రానికి ధన్యవాదాలు." అని కిషన్‌రెడ్డి అన్నారు. కృష్ణా జలాల్లో ఏపీ, తెలంగాణ వాటా తేల్చాలని ట్రైబ్యునల్‌కు కేంద్రం విజ్ఞప్తి చేసిందని.. కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. కొత్త నిబంధనలు రూపొందించాలని ట్రైబ్యునల్‌కు కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు వివరించారు. కృష్ణా జలాల్లో తమ వాటా తేల్చాలని తెలంగాణ కోరుతోందని చెప్పారు. ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జలాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర సర్కార్ నిర్ణయంతో తెలంగాణ ఆకాంక్ష నెరవేరుతుందని అనురాగ్ ఠాకూర్ ఆకాక్షించారు

# ఆగస్టు 7ను ప్రపంచ చేనేత దినోత్సవంగా ప్రకటించండి

- ఐక్యరాజ్య సమితిని కోరిన యర్రమాద వెంకన్న నేత
- యునైటెడ్ నేషన్స్ సెక్రటరీ జనరల్ కు లేఖ



**విశాల భారతి, హైదరాబాద్ :** ఆగస్టు 7ను ప్రపంచ చేనేత దినోత్సవంగా ప్రకటించాలని జాతీయ చేనేత దినోత్సవ రూపకర్త యర్రమాద వెంకన్న నేత యూఎన్‌వో సెక్రటరీ జనరల్‌ను కోరారు. బుధవారం ఆయన అమెరికాలోని ఐక్య రాజ్య సమితికి లేఖ రాశారు. ఆ లేఖ ప్రకారం.. ' మీరు మంచి ఆరోగ్యం, ఉత్సాహంగా ఉన్నారని నేను ఆశిస్తున్నాను. భారతదేశం, తెలంగాణ రాష్ట్రం నుంచి చేనేత కుటుంబ ప్రతినిధిగా మరియు ప్రపంచ వ్యాప్తంగా చేనేత అమూల్యమైన వారసత్వాన్ని గుర్తించడానికి నేను మీకు ఈ లేఖ వ్రాస్తున్నాను. 1905లో స్వదేశీ ఉద్యమంలో భారతదేశ ప్రజలు దిగుమతి చేసుకున్న యాంత్రిక వస్త్రాలను బహిష్కరించినప్పుడు, ఆగస్టు 7న చారిత్రక ప్రాముఖ్యతతో ప్రేరణ పొంది, భారతదేశంలో జాతీయ చేనేత దినోత్సవం అనే ఆలోచనను ప్రతిపాదించడానికి నేను 2006లో అంకురార్పణ చేశాను. తొమ్మిదేళ్ల ఎడతెగని ప్రయత్నం తర్వాత భారత ప్రభుత్వం 2015లో ఆగస్టు 7వ తేదీని అధికారికంగా జాతీయ చేనేత దినోత్సవంగా గుర్తించి ప్రకటించింది. అప్పటి నుంచి భారతదేశం చేనేత గొప్ప సంప్రదాయాన్ని , దాని సాంస్కృతిక ప్రాముఖ్యతను గౌరవించడానికి చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటుంది. టెక్స్‌టైల్ పరిశ్రమ కాలుష్యానికి ప్రధాన కారణమని, ప్రపంచ కాలుష్యంలో 20శాతం కి బాధ్యత వహిస్తుందని, చమురు పరిశ్రమ తర్వాత రెండవ స్థానంలో టెక్స్‌టైల్ ఉందని గుర్తించడం చాలా కీలకం. వస్త్ర ఉత్పత్తిలో సింథటిక్ రంగులు, మానవ నిర్మిత ఫైబర్‌ల వాడకం రసాయన కాలుష్యం నుంచి అధిక వనరుల వినియోగం వరకు పర్యావరణంపై వినాశకరమైన ప్రభావాలను కలిగి ఉంది. కృత్రిమ పదార్థాలతో సంబంధం ఉన్న హానికరమైన ప్రభావాలను తొలగిస్తుంది. చేనేత నేయడానికి కూడా విద్యుత్ అవసరం లేదు. ఇది శక్తిసమర్థవంతమైన , పర్యావరణ స్పృహతో కూడిన ఎంపిక. ప్యారిస్ క్లైమేట్ చేంజ్ కాన్ఫరెన్స్ ప్రపంచ ఉష్ణోగ్రతను ప్రస్తుత స్థాయిల నుండి 2 డిగ్రీల సెల్సియస్ తగ్గించాలని నిర్ణయించింది. ప్రపంచ చేనేత దినోత్సవం అనే భావన అనేక దేశాల్లో విస్తృతంగా ప్రాచుర్యం పొందింది. ఇటీవలి సంవత్సరాలలో భారతీయులే కాకుండా ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలోని భారతీయులు కాని వారు కూడా చేనేత దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సంవత్సరం లండన్‌లోని వందలాది మంది మహిళలు చేనేత చీరలను ధరించి హ్యాండ్లూమ్ వాక్ ద్వారా భారతీయ చేనేత వారసత్వాన్ని సగర్వంగా ప్రదర్శించారు. ఐక్యరాజ్యసమితి పర్యావరణాన్ని కాపాడవలసిన అవసరాన్ని నొక్కిచెప్పింది. మీ సమయం ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నందుకు ధన్యవాదాలు. ఐక్యరాజ్యసమితి ఈ ప్రయత్నానికి మద్దతు ఇస్తుందని ప్రపంచ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా మరింత స్థిరమైన మరియు పర్యావరణ అనుకూల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయడంలో సహాయపడుతుందని' నేను ఆశిస్తున్నానన్నారు.



# దశలవారీగా అభివృద్ధి పనులు

■ **ఎమ్మెల్యే కిశోర్ కుమార్**

**శాలిగౌరారం, విశాలభారతి:** శాలిగౌరారం మండలం ఇటుకులపాడు గ్రామంలో రూ.3.50 లక్షల వ్యయంతో మాదారం నుంచి ఇటుకలపాడు వరకు బీటి రోడ్డు నిర్మాణం పనులకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ బుధవారం శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ మాట్లాడుతూ మాదారం నుంచి ఇటుకులపాడు రోడ్డు నిర్మాణం చేపట్టడం కొంత ఆలస్యం అయిన మాట వాస్తవమేనని దశలవారీగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు అయితగోని వెంకన్న, జడ్పిటిసి ఎర్ర రణీల యాదగిరి ,ఎంపీపీ గంట లక్ష్మమ్మ ,వైస్ ఎంపీపీ అనిత రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తేజస్వి, పిఏ సి ఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, మాదారం గ్రామ సర్పంచ్ జేరిపోతుల మంజుల చంద్రమౌళి, తీగల వెంకన్న, తోటకూరి వంశీ, అక్కేన్ పల్లి శ్రీరాములు, వెంకట్ పతి, సురేష్ ,వంశీ బీఆర్ ఎస్ మండల,గ్రామ నాయకులు తదితరులుపాల్గొన్నారు.

# రాష్ట్రంలో బీజేపీ లేచేది లేదు..

- **కాంగ్రెస్ గెలిచేది లేదు**
- **మాటల సర్కార్ కావాలో చేతల సర్కార్ కావాలో ప్రజలే తేల్చుకోవాలి**
- **ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లటం ఖాయం**
- **కాంగ్రెస్ పాలనలో నేను రాను బిడ్డో.. సర్కార్ దవాఖానాకు అని పాడుకునేవారు**
- **వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు**

**హైదరాబాద్,విశాలభారతి:** రాష్ట్రంలో బీజేపీ లేచేది లేదు.. కాంగ్రెస్ గెలిచేది లేదని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్రావు అన్నారు. మాటలు చెప్పే సర్కార్ కావాలో.. చేతల సర్కార్ కావాలో ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. నారాయణపేట జిల్లాలోని కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవనాన్ని ప్రారంభించిన.. అనంతరం ప్రభుత్వ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్పై తీవ్రస్థాయిలో విమర్శించారు. "కొడంగల్ నియోజకవర్గానికి త్వరలోనే కృష్ణా జలాలు వస్తాయి. కొడంగల్కు ప్రస్తుతం కృష్ణా నుంచి తాగునీరు వస్తోంది. త్వరలోనే సాగునీరు కూడా వస్తుంది. కాంగ్రెస్ నేతలు అరచేతిలో వైకుంఠం చూపిస్తారు. ఓటుకు నోటు కేసులో రేవంత్‌రెడ్డి జైలుకు వెళ్లటం ఖాయం. 3 వేల తండాలను సీఎం కేసీఆర్ గ్రామపంచాయతీలుగా మార్చారు. ఇంటింటికి నల్లా ద్వారా మంచినీరు మహిళల కష్టాలు తీర్చారు కేసీఆర్. ఈసారి ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు సంబంధించిన పథకాలు ప్రవేశపెట్టనున్నారని" మంత్రి హరీశ్రావు స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పాలనలో 'నేను రాను బిడ్డో.. సర్కార్ దవాఖానాకు' అని పాడుకునేవారని మంత్రి హరీశ్రావు గుర్తు చేశారు. కానీ కేసీఆర్ హయాంలో సర్కార్ దవాఖానాలే సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులుగా మారాయని తెలిపారు. బిడ్డ కడుపున పడినప్పటి నుంచే ప్రభుత్వ సాయం అందుతోందని చెప్పారు. అదే విధంగా గర్భిణీలకు రూ.12 వేలు ఇస్తున్నామని.. కాన్పు తర్వాత కేసీఆర్ కిట్స్ ఇస్తున్నామని వివరించారు. ఇంకా 12 లక్షల మంది ఆడపిల్ల వివాహాలకు రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం చేశామన్నారు. అదే పొరుగున ఉన్న కర్ణాటకలో ఎలాంటి పథకాలు ఉన్నాయో తెసుకోవాలని సూచించారు. ఆ రాష్ట్రంలో వృద్ధాప్య పింఛనుగా నెలకు కేవలం



రూ.600 మాత్రమే ఇస్తున్నారని అన్నారు. "ఆడపిల్లలు చదువుకోవాలి.. పైకి రావాలని చెప్పి.. పెద్ద ఎత్తున పిల్లల కోసం డిగ్రీ కాలేజీలు, పీజీ కళాశాలలు ఎన్నో కార్యక్రమాలు తెచ్చారు. మహిళా యూనివర్సిటీని కూడా రాష్ట్రంలో సీఎం ప్రారంభించారు. మహిళల కోసం అనేక కార్యక్రమాలు చేశారు. ఏ పని చేసిన మహిళలకే లబ్ధి అందాలని చెప్పారు. మహిళలను ఇంకా ఎలా ఆర్థికంగా బలోపేతం చేయాలి. మహిళల కోసం మేనిఫెస్టోలో మహిళల కోసం శుభవార్తను కచ్చితంగా వింటారు." అని హరీశ్రావు అన్నారు.

అధికారంలో ఉన్న కర్ణాటకలో రైతుబంధు, రూ.4 వేల పింఛను ఎందుకు ఇవ్వట్లేదని కాంగ్రెస్ నాయకత్వాన్ని మంత్రి హరీశ్రావు ప్రశ్నించారు. మూడు గంటల కరెంటు కావాలనుకునేవాళ్లు కాంగ్రెస్కు ఓటు వేయాలని.. 24 గంటలు కరెంటు కావాలంటే బీఆర్ఎస్కు ఓటు వేయాలని హితవుపలికారు. రాష్ట్రంలో ఏ సర్వే చూసిన గులాబి జెండా మళ్లీ ఎగురుతుందనీ.. కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం అవుతారని చెబుతున్నాయని హరీశ్ రావు పేర్కొన్నారు. అలాగే కొడంగల్ నియోజకవర్గంలో పట్నం నరేందర్ను గెలిపించుకుని.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రజలను కోరారు. అంతకు ముందు హరీశ్ రావు పర్యటన సందర్భంగా బస్డిపో నుంచి శివాజీ చౌరస్తా వరకు బీఆర్ఎస్ శ్రేణులు భారీ ర్యాలీ చేపట్టారు

# మెస్ చార్జీలు ఇవ్వండి సారూ..

■ **ఎస్ఎంసీ చైర్మన్ చింతల సాయిలు**

**చౌటుప్పల్, విశాల భారతి:** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాల ఎస్ ఎం సి చైర్మన్ చింతల సాయిలు మాట్లాడుతూ గురుకుల పాఠశాల విద్యార్థుల మెస్ చార్జీలు పెంచి జులై నెల నుండి ఇంప్లిమెంట్ చేస్తాము అని రాష్ట్ర ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ గారు అసెంబ్లీలో తెలిపినారు. కానీ ఇప్పటివరకు గురుకుల పాఠశాలలో ఇంప్లిమెంటేషన్ కావడం లేదు విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టలేకపోతున్నావు కావున విద్యార్థుల ఆరోగ్య దృష్టిలో ఉంచుకొని పెంచిన మెస్ చార్జీల ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టించగలరని తెలంగాణ గురుకుల కార్యదర్శి హైదరాబాద్ గారికి వినతి పత్రం అందజేశారు.



# పూసల కులాన్ని ఎంబీసీలో చేర్చాలి

**నల్లగొండ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో సంచార జీవనం గడుపుతున్న పూసల కులాన్ని ఎంబీసి లిస్ట్ లో చేర్చాలని పూసల చైతన్య వేదిక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు అమరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అమరేందర్ మాట్లాడుతూ కులవృత్తి బాగంగా గాజులు పిన్నీసులు రబ్బర్ బ్యాండ్లు అమ్ముకుంటూ జీవనోపాధి చేస్తున్న పూసల కులస్తులు తెలంగాణ రాష్ట్రంలో ఎంతో వెనుకబడి ఉన్నారని తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన కులాల ఎంబిసీ లిస్టులో పూసల కులం లేకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు. ఎన్నోసార్లు ఎమ్మెల్యేలకు మంత్రులకు వినతి పత్రాలు ఇచ్చినా కూడా పట్టించుకోలేద ని అందుకే ప్రభుత్వ తీరుకు నిరసనగా 7వ తేదీ శనివారం రోజు హైదరాబాదులోని ఇందిరా పార్క్ వద్ద పూసల గోస నిరసన దీక్ష చేపడుతున్నామని రాష్ట్రంలో ఉన్న పూసల కులస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు



# బిఆర్ఎస్ తోనే బడుగుల ఆర్థిక అభివృద్ధి

- **దేశానికే దిక్సూచిగా కేసీఆర్ సంక్షేమ పథకాలు..**
- **ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ...**

**ముషీరాబాద్,విశాల భారతి:** తెలంగాణ స్వరాష్ట్రం తర్వాత బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధికై సీఎం కేసీఆర్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే దిక్సూచి లాగా ఉన్నాయని కొనియాడారు. తెలంగాణలోని కులవృత్తులకు పూర్వ వైభవం తీసుకువచ్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఊపిరి పోశారని పేర్కొన్నారు. బ్యాంకులతో సంబంధం లేకుండా లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందిస్తూ స్కీం నిరంతర ప్రక్రియగా ప్రకటించడం చారిత్రకమన్నారు. అంతేకాకుండా కార్పొరేషన్ పదవులు, గ్రేటర్ ఎన్నికల్లో బడుగులకు పెద్దపీట వేసి సామాజిక న్యాయాన్ని పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే నన్నారు. అలాంటిది రాష్ట్రంలో మూడవ సారి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో కొండూరు సత్యనారాయణ పేర్కొన్నారు.



## దసరా సెలవులు ప్రకటించిన

# తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్,విశాలభారతి:**

తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగల్లో దసరా మొదటి వరుసలో ఉంటుంది. అందుకే స్కూల్స్, కాలేజీలకు ముందుగానే సెలవులు ప్రకటించారు. ఈ సందర్భంగా బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకొని రాష్ట్రంలోని బడులకు విద్యాశాఖ సెలవులు ప్రకటించింది. అక్టోబర్ 13వ తేదీ నుంచి అక్టోబర్ 25వ తేదీ వరకు 13 రోజుల పాటు ప్రభుత్వ, ప్రైవేట్ బడులకు సెలవులు ఉంటాయని తెలిపింది.

ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని రకాల స్కూళ్లు ఈ సెలవులను పాటించాలని సూచించింది. అలాగే తెలంగాణలోని ఇంటర్మీడియట్ కాలేజీలకు మాత్రం 19 నుంచి 25 వరకు సెలవులివ్వాలని వెల్లడించింది. తెలంగాణలో దసరా సెలవులు గతేడాది 14 రోజులు ఉండగా.. ఈసారి మాత్రం 13 రోజులే ఇచ్చారు. తిరిగి అక్టోబర్ 26న పాఠశాలల తిరిగి తెరుచుకోనున్నాయి. తెలంగాణ ప్రజలు అక్టోబర్ 24వ తేదీన దసరా పండగ జరుపుకోనున్నారు. అక్టోబర్ 22న దుర్గాష్టమి అదే రోజు బతుకమ్మ పండుగ నిర్వహిస్తారు.ఈ నేపథ్యంలో స్కూళ్లు, కాలేజీలు, కార్యాలయాలకు తెలంగాణ ప్రభుత్వం ముందుగానే సెలవులు ప్రకటించింది.



# హైదరాబాద్ స్టూడెంట్లకు ఆండర్సన్ యూనివర్సిటీ స్పాట్ అడ్మిషన్లు

**విశాల భారతి, హైదరాబాద్:**

అమెరికాలో యాపిల్ డిస్టింగ్విష్డ్ యూనివర్సిటీగా పేరొందిన ఆండర్సన్ యూనివర్సిటీ హైదరాబాద్ విద్యార్థులకు స్పాట్ అడ్మిషన్లు అందిస్తోంది. ఈ కార్యక్రమం అక్టోబర్ 5 గురువారం ఉండనుంది. ఐటీ, మేనేజ్‌మెంట్, ఇంజినీరింగ్ సహా అన్ని రకాల విద్యార్థులు తమ పేర్లను నమోదుచేసుకోవచ్చు, మరిన్ని వివరాలకు 6387149133 నెంబరులో సంప్రదించవచ్చు. అర్హులైన విద్యార్థులకు అక్కడికక్కడే ప్రవేశార్హత లభిస్తుంది.

ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రోవోస్ట్ డాక్టర్ ర్యాన్ నీల్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ డాన్ పాల్గొంటారు. అక్కడే ప్రవేశాలు ఖరారు చేసుకుని, ఐ20లు కూడా త్వరగా పొందవచ్చు. యూనివర్సిటీ హబ్‌తో భాగస్వామ్యం వల్ల ప్రవేశాల ప్రక్రియ విద్యార్థులకు సులభతరం అవుతుంది. ఆండర్సన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్, బిజినెస్ ఎనలిటిక్స్ ప్రోగ్రాంలలో ఎంఎస్‌తో పాటు, డేటా డ్రివెన్ నైపుణ్యాలు, సైబర్‌సెక్యూరిటీ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్ లాంటి పలు కోర్సులు ఉంటాయని డాక్టర్ నీల్ తెలిపారు. యూనివర్సిటీ హబ్ ఇప్పటివరకు లక్ష మంది విద్యార్థులకు అమెరికాలోని ప్రతిష్ఠాత్మక సంస్థలలో చదువుకునే అవకాశం కల్పించిందని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ అనిల్ పల్లా తెలిపారు. ఐఈఎల్‌టీఎస్‌లో కనీసం 6.0 స్కోరు ఉండి, గ్రాడ్యుయేషన్ అయిపోయినవారు నేరుగా వచ్చి వారం రోజుల్లో ఐ20 తీసుకోవచ్చని చెప్పారు. తమ సంస్థ సేవలు పూర్తిగా ఉచితమని ఆయన స్పష్టం చేశారు. సరైన కోర్సు, యూనివర్సిటీ ఎంపిక, ప్రయాణ ఏర్పాట్లు, ఎంఎస్ పట్టా పొందడం వరకు అన్నీ యూనివర్సిటీ హబ్ చూసుకుంటుందన్నారు. పేద విద్యార్థులకు ఉచితంగా ఐఈఎల్‌టీఎస్ శిక్షణ కూడా ఇస్తామని చెప్పారు. ఒక ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో ప్రవేశం కావాలనుకుంటున్న విద్యార్థులకు యూనివర్సిటీ హబ్, ఆండర్సన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం అద్భుతమైన అవకాశం. అందువల్ల అర్హులైన విద్యార్థులు అక్టోబర్ 5న నేరుగా వచ్చి, అమెరికాలో ఉన్నతవిద్య అనే కలను నెరవేర్చుకోవచ్చు.




**ఆండర్సన్ యూనివర్సిటీ గురించి...**

ఆండర్సన్ యూనివర్సిటీ అనేది అంతర్జాతీయ స్థాయి విద్యను అందించే ప్రముఖ విద్యా సంస్థ. అమెరికాలో ఉన్న ఈ యూనివర్సిటీ పలు రకాల అండర్ గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ కోర్సులను అందిస్తూ విద్యార్థులు విజయవంతం కావడానికి దోహదపడుతుంది.

**యూనివర్సిటీ హబ్ గురించి..**

యూనివర్సిటీ హబ్ అనేదది ప్రముఖ కన్సల్టెన్సీ. విద్యార్థులు అమెరికాలో అగ్రశ్రేణి యూనివర్సిటీలలో చదివేందుకు వారికి కావల్సిన సాయం చేస్తుంది. అపారమైన అనుభవం, విద్యార్థుల విజయంపై నిబద్ధత కలిగిన ఈ సంస్థ విదేశీ విద్య మరింత అందుబాటులోకి వచ్చేందుకు కావల్సిన సమగ్ర సేవలన్నీ అందిస్తుంది.

# తెలంగాణలో ఓట్ల కోసం కొందరు ఎన్టీఆర్ జపం చేస్తున్నారు

- **టీడీపీ పొలిట్‌బ్యూరో మెంబర్, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ**
- **తెలంగాణలో టీడీపీ ఎక్కడ అన్నవారికి త్వరలో చూపిస్తానంటూ సవాల్**

**హైదరాబాద్, విశాల భారతి:**

అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతల మధ్య ప్రతి రోజు విమర్శల పర్వం కొనసాగుతోంది. ఇక తాజాగా బాలకృష్ణ తెలంగాణ రాజకీయ నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓట్ల కోసం మూడు రోజులుగా ఎన్టీఆర్ జపం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అరెస్ట్ అయినప్పుడు మాట్లాడకుండా ఇప్పుడు ఎన్నికల్లో ఓట్ల కోసమే ఎన్టీఆర్ పేరును వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఏపీ, తెలంగాణలో రాజకీయాలు జోరందుకుంటున్నాయి. ఒకరిపై ఒకరు మాటల యుద్ధాలు కొనసాగుతున్నాయి. ఏపీలో చంద్రబాబు అరెస్టు తర్వాత రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారిపోయాయి. అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతల మధ్య ప్రతి రోజు విమర్శల పర్వం కొనసాగుతోంది. ఇక తాజాగా బాలకృష్ణ తెలంగాణ రాజకీయ నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఓట్ల కోసం మూడు రోజులుగా ఎన్టీఆర్ జపం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు అరెస్ట్ అయినప్పుడు మాట్లాడకుండా ఇప్పుడు ఎన్నికల్లో ఓట్ల కోసమే ఎన్టీఆర్ పేరును వాడుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అరెస్ట్ పై కొందరు వెంటనే స్పందించ లేదని పరోక్షంగా బీఆర్ఎస్ పై బాలకృష్ణ విమర్శలు చేశారు. తెలంగాణ రాజకీయ నేతలు చంద్రబాబు అరెసట్‌పై స్పందించినా, ఎన్టీఆర్ జపం చేసినా ఎటువంటి లాభం లేదని బాలకృష్ణ అన్నారు. రెండు రాష్ట్రాలు తనకు రెండు కళ్లు లాంటివని అన్నారు. తెలంగాణ తెలుగుదేశం పార్టీకి తాను అండగా ఉంటానని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్ట్, ఏపీలో జరుగుతున్న పరిణామాలు, తాజా రాజకీయ అంశాలపై చర్చించారు. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి ప్రతిపక్ష పార్టీల నేతలను అరెస్ట్ చేయడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. చంద్రబాబు అరెసట్‌పై సినీ పరిశ్రమ స్పందించకపోవడంపైనా బాలయ్య మాట్లాడారు. ఎవరు స్పందించినా స్పందించకపోయినా ఐ డోంట్ కేర్ అన్నారు. కాగా, ఏపీలో చంద్రబాబు అరెస్టు తర్వాత రోజుకో విధంగా రాజకీయ మలుపులు తిరుగుతోంది. వైఎస్ఆర్ సీపీ వల్లే చంద్రబాబు అరెస్టు అయ్యారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. చంద్రబాబుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ అక్రమ కేసులు బనాయిస్తున్నారని నేతలు వైసీపీపై మండిపడుతున్నారు. చంద్రబాబు అరెస్ట్ వ్యవహారం తర్వాత వైసీపీ, టీడీపీ నేతల మధ్య రోజు మాటల యుద్ధాలు కొనసాగుతున్నాయి. చంద్రబాబు ఏ తప్పుడు చేయలేదని, కావాలని కేసుల్లో ఇరికించేందుకు కేసులు నమోదు చేస్తున్నారని ఆక్రోశం టీడీపీ నేతలు వెల్లగక్కుతున్నారు. ఎన్ని కేసులు బనాయించినా, ఎన్ని ఇబ్బందులకు గురైనా ఏ మాత్రం భయపడేది లేదని నందమూరి బాలకృష్ణ స్పష్టం చేస్తున్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబును తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారని అటు చంద్రబాబు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఏదీ ఏమైనా ఎలాంటి కేసులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగానే ఉన్నామని, తమ వెంట రాష్ట్ర ప్రజలు ఉన్నారని అంటున్నారు. ప్రజల కోసం ఎన్ని ఇబ్బందులైనా పడతామని పేర్కొంటున్నారు.






# దబ్బా వెంకట నర్సు ఆశయాలను కొనసాగిస్తాం

**మహబుబాబాద్/ బయ్యారం , విశాల భారతి:** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బయ్యారం సబ్ డివిజనల్ కమిటీ సీనియర్ నాయకులు కామ్రేడ్ దబ్బా వెంకట నర్సు సంతాప సభను బుధవారం గంధంపల్లిలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గంధంపల్లి గ్రామ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ కందగట్ల రాముడు అధ్యక్షతన జరిగింది. ఈ సంతాప సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బందారి ఐలయ్య, బయ్యారం సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి నందగిరి వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా నాయకులు జి సక్రులు మాట్లాడుతూ.. కామ్రేడ్ వెంకట నర్సు అత్యంత వెనుకబడిన ఆదివాసీ కుటుంబంలో జన్మించాడని కామ్రేడ్ వెంకట నర్సు చిన్నతనము నుండే ఈ ప్రాంతంలో జరుగుతున్న దోపిడి అనిచి వేతను చూసి సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాజకీయాలకు ఆకర్షితుడై జీతగాళ్ల సంఘంలో సభ్యుడుగా చేరి కామ్రేడ్ దొరన్న నాయకత్వంలో జీతగాండ్ల సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేశాడు. ఆనాడు అజ్ఞాత నాయకులైన కామ్రేడ్ దొరన్న. బాటన్న. ఎల్లన్న. లింగన్న లకు కొరియర్గా పనిచేశాడు ఈ సందర్భంలోనే పార్టీపై నిర్బంధము వచ్చినప్పుడు ప్రతిఘటన దళాల్లో కొనసాగాడు. ఈ క్రమంలో పార్టీని విచ్చిన్నం చేయడానికి ప్రయత్నించిన మాఫియా ముఠాను ఎదుర్కొనే సందర్భంలో జరిగిన దాడులలో తాను ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. కామ్రేడ్ వెంకట నర్సు చాలా మొండివాడు అలాగే అత్యంత ధైర్యవంతుడు ఉద్యమ రక్షణ కోసం తన వంతు పాత్రను క్రియాశీలకంగా పోషించాడని వారన్నారు. కామ్రేడ్ వెంకట నర్సు గ్రామం నుండి రాష్ట్ర వరకు జరిగిన అనేక ప్రజా ఉద్యమాలలో క్రియాశీలక పాత్రని పోషించాడు. ఈ సందర్భంలోనే ఖమ్మంలో మిర్చి రైతులపై పోలీసుల లాఠీ చార్జిని ఎదుర్కొని కామ్రేడ్ దొరన్నతో పాటు చంచల్గూడ జైల్లో ఉన్నాడు. కామ్రేడ్ వెంకట నర్సు పై 10 అక్రమ కేసులు మోపబడినవి అంటేనే ఉద్యమంలో ఎలాంటి సురుకైన పాత్రను పోషించాడో అర్థమవుతుందని వారన్నారు. కామ్రేడ్ వెంకట నర్సు పార్టీలో చేరిన నాటి నుండి తుది శ్వాస వరకు కూడా అనేక నిర్బంధాలను తప్పుడు కేసులు శత్రువుల దాడులను సమర్థవంతంగా ఎదుర్కొంటూ ఉద్యమంలో కొనసాగాడు. కామ్రేడ్ వెంకట నర్సు మరణం విప్ల ఓద్యమానికి ప్రధానంగా బయ్యారం మండల ప్రజా ఉద్యమాలకు తీరని లోటుగా భావిస్తున్నాం. కామ్రేడ్ వెంకట నర్సు ఏ ఆశయ సాధన కోసం పనిచేశాడో ఆ లక్ష సాధన కోసం మన మందరం పనిచేసినప్పుడు మాత్రమే ఆయనకు నిజమైన నివాళులర్పించిన వార మౌతామని అన్నారు. ఈ సంతాప సభలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు మాజీ జెడ్పిటిసి పూనేం భిక్షమన్న, తోకల వెంకన్న, రామచంద్ర మురళి, చందు వీరన్న, అవిర నారాయణ, గండెల పుణేష్, ఎస్ సీతారాములు, వీరస్వామి, నిరంజన్, సైదులు, నాయకులు, యాకయ్య, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# 'ప్రభుత్వ పథకాల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యమివ్వాలి'



**మహబూబాబాద్/ బయ్యారం, విశాల భారతి:** బయ్యారం మండల మలి దశ తెలంగాణ ఉద్యమ కారుల 3 రోజుల రిలే నిరాహార దీక్షలో భాగంగా బయ్యారం బస్టాండ్ సెంటర్ లో రెండో రోజు రిలే నిరాహార దీక్ష రెంటాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉద్యమ నాయకుడు రెంటాల బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. నీళ్లు నిధులు నియామకాల కోసం 2001 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో రాష్ట్ర సాధనకోసం పని చేసిన ఉద్యమ కారులను ఆదుకోవాలని, వారికి ప్రత్యేక సంక్షేమ నిధిని ఏర్పాటు చేయాలని , విస్మరస్తే పతనం తప్పదన్నారు. ఉద్యమ కారులని ఆదుకోవాలని ఉద్యమ కారులకు రూ. 25 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కారుల పిల్లలకు ఉచిత విద్య వైద్యం అందిచాలని, భూమి లేని నిరుపేదలకు 250 గజాల ఇంటి స్థలం తో పాటు 5లక్షల రూపాయలతో డబుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని, సంక్షేమ పథకాలు ఉద్యమ కారులకుఅందించాలని, చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశం కాలిపించాలని కోరుతూ ఈ నిరాహార దీక్షను ఈ రిలే దీక్షలకు అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు,ప్రజలు ప్రజాస్వామిక వాదులు, మేధావులు మద్దతు తెలుపాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బయ్యారం మండల తెలంగాణ ఉద్యమ కారుల ఫోరమ్ నాయకులు, వన్నం రామారావ్, అడిదెల వీరబద్రం నాయిని శ్రీనివాస్ రెడ్డి, బానోత్ మోహన్ జీ, కాసం ఉప్పల్ రెడ్డి, మీసాల వెంకటయ్య, కుక్కల శరబందు, గుండాగాని రామానాథం, ఆవుల లింగయ్య, గుండాల శ్రీనివాస్, జెల్లి, నకిర యాదగిరి, కాడబోయిన వెంకన్న, వెంకట్ నారాయణ, పిట్టల వీరన్న, మెగారబోయిన శ్రీను, ఎక్కంబరం, గుగులోత్ బద్రు, ఉప్పలయ్య, మధార్ బయగల శ్రీను, నిమ్మరబోయిన వెంకన్న, కుక్కల ఎల్లయ్య, శిద్రబోయిన శ్రీను, వెంకన్న, బాస్కర్, గుండ్ల బాబు, సప్పావత్ బాస్కర్, గద్దం వీరారెడ్డి, పాల్గొన్నారు.




# దివ్యాంగులకు 5 శాతం 'డబుల్' ఇండ్లు కేటాయించాలి

**మహబుబాబాద్/ కురవి, విశాల భారతి**:దివ్యాంగులకు 5 శాతం 'డబుల్' ఇండ్లు కేటాయించాలని డిమాండ్చేస్తూ బుధవారం కురవి మండల కేంద్రంలో తహసీల్దార్ఆఫీస్ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. రడం గౌరమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాజా పాల్గొని మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఐదు శాతం డబల్ బెడ్ రూమ్లు ఇవ్వాలి. కొత్త రేషన్ కార్డ్, అంతోదయ కార్డులు, ఇవ్వాలని, అర్హులైన వికలాంగులకు ఇవ్వాలని, మండల కేంద్రంలో మోడల్ కాలనీలు కట్టించి వికలాంగులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కురవి ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం ఎమ్మార్వో మాట్లాడుతూ.. మీరు ఇచ్చిన ఈ వినిత పత్రంను జిల్లా కలెక్టర్ కి పంపించి మీ సమస్యను పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు బైరి వీరన్న, కర్నాటి మల్లికార్జు, రచ్చ ఉప్పలయ్య, ఇర్రి యాకయ్య, తోట శీను, దూస వీరభద్రం, సిహెచ్ పద్మ, జి రామకృష్ణ, బి ఐలయ్య, బి రవి, గాంఢ్ల భద్రయ్య, రాడం సారయ్య, ఉప్పలయ్య, డి లెనిన్, తదితరులు పాల్గొన్నారు.



# 'కేంద్ర మంత్రి అజయ్కుమార్ మిశ్రాను బర్తరఫ్ చేయాలి'

**మహబూబాబాద్/ బయ్యారం, విశాల భారతి**: బయ్యారం రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. లఖింపూర్కేరి ఘటన బాధ్యులపై చట్టపరరంగా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడాన్ని నిరసిస్తూ.. లఖింపూర్ కేరి ఘటనలో అమరులైన వారిని స్మరిస్థు ఈరోజు బయ్యారంలో కొవ్వొత్తులతో ర్యాలీ చేయడం జరిగింది. ఈకార్యక్రమాన్ని ఉద్దేసించి అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కోశాదికారి నందగిరి వెంకటేశ్వర్లు, బయ్యారం మండల అధ్యక్షులు రామగిరి భిక్షం, రైతు సంఘం రాష్ట్ర నాయకులు మండా రాజన్న, జిల్లా నాయకులు నంబూరి మధు, భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐ ఎఫ్ టి యు)జిల్లా అధ్యక్షులు ఎస్.కె మదార్, కార్యదర్శి బిల్లకంటి సూర్యం, జిల్లా సహాయ కార్యదర్శి రాసమల్ల ఉప్పలయ్య, ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) జిల్లా కార్యదర్శి ఊకే పద్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు, రైతు కూలి సంఘాల, కార్మిక సంఘాల నాయకులు రామచంద్రుల మురళి, వల్లాల వెంకన్న, కూనూరి యుగందర్, మోహన్, బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిపక్షాల మాయ మాటలను ప్రజలు నమ్మరు

- తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

**తుంగతుర్తి , విశాల భారతి:** తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని సంక్షేమ పథకాల ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ విజయం ఖాయమని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని వెంపటి రోడ్డులో ఒక కోటి పది లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టిన నూతన క్యాంపు, వసతి గృహాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ కమల దంపతుల ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో ఒక లక్ష ఇరవై వేల ఎకరాలు కాలేశ్వరం జనాల ద్వారా సాగునీరు, 24 గంటలు ఉచిత విద్యుత్తు, 13 వేల మంది కళ్యాణ లక్ష్మి, 50, వేల మందికి ఆసరా పింఛన్లు, దళిత బంధు, రైతు బీమా, కెసిఆర్ కిట్టు, రుణమాఫీ వంటి పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉండే సమస్యలను తెలుసుకొని పరిష్కరించే దిశలో ప్రతి నియోజకవర్గ కేంద్రానికి ఒక ఎమ్మెల్యే క్యాంపు వసతి గృహాన్ని ఏర్పాటు ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. నియోజకవర్గంలో తలపెట్టిన ఆశీర్వాద సభ, అభివృద్ధి సభలు అనుకున్న దానికంటే రెట్టింపు దశలో ప్రజలంతా ఆశీర్వదించినట్టు తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపి ఎన్ని కుట్రలు కుతంత్రాలు పండిన తుంగతుర్తి నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. నాయకులు కార్యకర్తలు ఐకమత్యంతో గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యేను పలువురు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జెడ్పి చైర్ పర్సన్ గుజ్జా దీపిక యుగంధర్ రావు, జిల్లా రైతు బంధు కోఆర్డినేటర్ ఎస్.కె రజాక్, ఆయిల్ ఫ్రెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి ,డిసిసిబి డైరెక్టర్ గుడిపాటి సైదులు, ఎంపీపీ గుండగాని కవిత రాములు గౌడ్ తిరుమలగిరి మార్కెట్ చైర్ పర్సన్ స్రవంతి, మున్సిపల్ చైర్ పర్సన్ రజిని, మార్కెట్ చైర్మన్ సురేందర్ నాయక్, మాజీ చైర్మన్ పులుసు యాదగిరి గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య, మండల రైతు సమితి కన్వీనర్ దొంగరి శ్రీను, జడ్పిటిసి దావుల వీరప్రసాద్ యాదవ్ దామోదర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.




# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు

**మహబూబాబాద్/ డోర్నకల్, విశాల భారతి**: డోర్నకల్ మండల కేంద్రంలో ఏడవ రోజు మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని చేపట్టిన సమ్మెకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ ఇంఛార్జి సాయి కుమార్ మరియు గుగులోతు సూర్య ప్రకాష్ లు మాట్లాడుతూ... ఏదైతే మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి వాడి డిమాండ్ అను పరిష్కరించాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులు సన్నీ చేపట్టడం వలన విద్యార్థులు మధ్యాహ్న భోజనం లేక పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, చాలామంది విద్యార్థులు మధ్యాహ్నం ఆకలి తో అలమటిస్తున్నారని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల ఏడాది పాటు పెండింగ్లో ఉన్న బిల్లులు రాక అనేక అవస్థలు పడుతున్నారు. దీంతో అప్పులు తెచ్చి మధ్యాహ్నం భోజనం పెడుతున్నారని, తెచ్చిన అప్పు వడ్డీకే కట్టలేక సరిపోక ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు. ఇటు విద్యార్థులను అటు కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని తెలిపారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి న్యాయమైన డిమాండ్ పరిష్కరించేంతవరకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. లేనియెడల రాష్ట్ర ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సింహాద్రి, సిఐటియు నాయకురాలు ధనలక్ష్మి కార్మికులు పాల్గొన్నారు.




# పని చేసే వారికి పట్టం కట్టండి

- విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్రెడ్డి
- చండూర్లో ఆర్డీవో ఆఫీస్ప్రారంభం

**చండూరు, విశాలభారతి:** వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీల నాయకుల మాయ మాటలు విని మోసపోవద్దని, ఇచ్చిన మాట ప్రకారం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న పార్టీకి పట్టం కట్టాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్రెడ్డి కోరారు. చండూరు మండల కేంద్రంలో రెవెన్యూ డివిజన్ఆఫీస్ను బుధవారం జగదీశ్రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్కే దక్కిందన్నారు. ఇచ్చిన హామీ ప్రకారమే రెవెన్యూ డివిజన్ఏర్పాటు చేశామన్నారు. అదే విధంగా మంత్రి రూ. 56 కోట్లతో ఇడికూడ గ్రామం నుంచి నాంపల్లి మండలం ముష్టిపల్లి వరకు డబుల్ రోడ్డు లైన్ ప్రారంభించామన్నారు. 10 నెలల కాలంలోనే మునుగోడు నియోజకవర్గానికి రూ.571 కోట్లతో అభివృద్ధి పనులకు శాంక్షన్చేశామన్నారు. ప్రపంచంలోనే ఫ్లోరోసిస్పీడిత ప్రాంతంగా పేరున్న మునుగోడు నుంచే కృష్ణా జలాలు సరఫరా ప్రారంభించామన్నారు. దీంతో అప్పటి నుంచి ఒక్క ఫ్లోరోసిస్ కేసు కూడా నమోదు కావడం లేదన్నారు. గృహలక్ష్మి పథకం కింద.. మునుగోడు నియోజకవర్గంలో 3వేల ఇండ్లు మంజూరు చేశామన్నారు. సంబంధించిన పత్రాలు కూడా బుధవారం మంత్రి లబ్ధిదారులకు అందజేశారు. త్వరలోనే శివన్నగూడెం ప్రాజెక్టును పూర్తి చేసి పరీవాహక గ్రామాలకు సాగునీరు వచ్చే పనులు పూర్తి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా చెప్పారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. అదే విధంగా ఎంపీ బడుగు లింగయ్య యాదవ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలో కూడా తెలంగాణలో అమలు చేసే పథకాలు లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్పొరేషన్చైర్మన్ పల్లె రవికుమార్, జడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ పల్లె కళ్యాణి రవికుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ చంద్రకళ, కౌన్సిలర్లు కోడి వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ దోటి సుజాత వెంకన్న యాదవ్, కౌన్సిలర్లు అన్నెపర్తి శేఖర్, కొంరెడ్డి యాదయ్య, చిలుకూరి రాధిక శ్రీనివాస్, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కేసీఆర్ హయాంలోని అభివృద్ధి

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

**మోతె, విశాల భారతి:** కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ తెలిపారు బుధవారం మండల కేంద్రంలో క్రీడా సామాగ్రి, చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ వచ్చిన తర్వాత అభివృద్ధిలో తెలంగాణ ప్రభుత్వం దూసుకుపోతుందని, తెలంగాణలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందుతుందని, వరి పంటలో దేశంలో రెండో స్థానానికి చేరుకున్నామని, రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలని ఏర్పాటుచేసి క్రీడా సామాగ్రిని తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా మహిళలకు బతుకమ్మ చీరలు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శీలం సైదులు, తాసిల్దార్ ప్రకాష్ రావు, ఎంపీడీవో వెంకటాచారి, ఎం పి ఈ ఓ హరి సింగ్ నాయక్, ఏపిఎం నరసింహ తదితరులు పాల్గొన్నారు.




# తపాలా ఉద్యోగులని పర్మినెంట్ చేయాలి

**చిట్యాల, విశాలభారతి:** తపాలా ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అఖిల భారత గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘాల జేఏసీ డిమాండ్ చేశారు. చిట్యాల మండలంలోని స్థానిక సబ్ పోస్ట్ ఆఫీస్ ముందు తపాలా ఉద్యోగులు ఒక రోజు సమ్మె కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 8గంటల పని, పెన్షన్ తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, సీనియర్లకు సర్వీస్ ప్రకారంగా అదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలని హెల్త్ ఇన్సూరెన్స్ స్కీము వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్లుగా గ్రామాలలో అనేక సేవలు చేస్తున్నటువంటి తపాలా ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనియెడల భవిష్యత్తు లో నిరవధిక సమ్మె చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ నల్గొండ డివిజన్ సహాయ కార్యదర్శి హరీష్ కుమార్, అంతటి నరసింహ, జానీ పాషా, నాగేశ్వరరావు, రవీందర్, భార్గవ్ రామ్, యాదగిరి ,రవి ,శివ ,స్వామి, మహేష్ ,వహీద్ ,చందన, స్వప్న, దివ్య ,వాణి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఒక్కరోజు సమ్మె

**ధర్పల్లి, విశాల భారతి:** ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్పల్లి సబ్ ఆఫీస్ వద్ద బిపిఎంలు, ఏబిపీఎంలు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఒకరోజు సమ్మె నిర్వహించారు. ప్రధానంగా తక్కువ జీతంతో ఎక్కువ పనులు నిర్వహిస్తున్న తమకు కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖ పరిమితమైన జీతాన్ని ఇస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నారు అని అన్నారు. బీపీఎంలు, ఏబీపీఎంలు నాలుగు గంటలు కాకుండా ఎనిమిది గంటలు విధులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తపాలా శాఖ పెడుతున్న టార్గెట్లను పూర్తిచేస్తూ వివిధ రకాల సేవింగ్ ఖాతాలను ఓపెన్ చేస్తూ ప్రజలతో మమేకమై తపాలా శాఖ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. నాలుగు ఏళ్లు సర్వీస్ పొందిన వారు కూడా కనీస వేతనం తీసుకోవడం లేదని అన్నారు. బిపిఎం, ఎబిపిఎం పోస్టులను రెగ్యులర్ చేస్తూ సివిల్ సర్వీసు హోదా కల్పించాలని డిమాండ్ చేశారు. 12, 24, 36 ఏళ్ల సర్వీస్ లో ఉన్నవారికి ఇంక్రిమెంట్లు ఇస్తు ప్రతి సంవత్సరానికి ఒక ఇంక్రిమెంటు ఇవ్వాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆలిండియా డాక్ సేవక్ యూనియన్ తరపున ధర్పల్లి బిపిఎం, ఎబిపిఎంలు ముక్తకంఠంతో కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



# అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- ఎంపీపీ ఆశ శ్రీకాంత్ రెడ్డి

**మోతె, విశాల భారతి :** అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ ఎం. ఆశా తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శ్రీ శక్తి భవన్ లో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. మండలంలో మూడు నెలల కాలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులు నివేదికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పి. పుల్లారావు, తాసిల్దార్ ప్రకాష్ రావు. ఎంపీడీవో వెంకటాచారి, ఎం పి ఈ ఓ హరి సింగ్ నాయక్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.





# బతుకమ్మ చీరల పంపిణి

- పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

**ఆమనగల్లు, విశాల భారతి:** ఆడపడుచులకు అండగా బిఆర్ఎస్ ప్రభుత్వం ఉంటూ పండుగ పర్వదినాన కానుకగా బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని కల్వకుర్తి శాసన సభ్యులు జైపాల్ యాదవ్ అన్నారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సిరిసిల్ల, పోచంపల్లి, గద్వాల తదితర ప్రాంతాల నేత కార్మికులకు ఉపాధి అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కడ్తాల్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి, ఆమనగల్లు మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్ ల అధ్యక్షతన ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కడ్తాల్ 9500 బతుకమ్మ మండలానికిచీరలు అందజేసినట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలిచిందని, మహిళలు ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగకు తెలంగాణ ఆడపడుచులు కొత్త చీరలు కట్టుకోవాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ 2017 నుంచి బతుకమ్మ చీరల పంపిణీ పథకాన్ని ప్రారంభించారన్నారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ కమిషనర్ శ్యాంసుందర్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ తల్లోజు విజయకృష్ణ, జెడ్పిటిసి దశరత్ నాయక్, వైస్ఎంపీపీ ఆనంద్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నిట్ట నారాయణ, పిఏసిఎస్ చైర్మన్ వెంకటేష్ గుప్తా, మండల రైతు అధ్యక్షుడు జోగు వీరయ్య, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు జంగమ్మ, గ్రామ రైతు అధ్యక్షుడు నరసింహ, మార్కెట్ డైరెక్టర్ లాయక్ అలీ, ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు నరేందర్ రెడ్డి, బిక్షపతి, గణేష్, అశోక్ రామచంద్రయ్య ఎంపిడివో రామకృష్ణఏపీఎం రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్, మహిళా సంఘం సభ్యులు వనిత, లావణ్య, శైలజ, భారతమ్మ, లక్ష్మమ్మ,యాదమ్మ, విజయ, వసంత, నర్సమ్మ తదితరులుపాల్గొన్నారు.



## ఉచితంగా క్రికెట్, వాలీబాల్ కిట్లు పంపిణీ చేసిన ఎంపీపీ

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గ్రామ గ్రామానికి యువకులకు ఉచితంగా క్రికెట్, వాలీబాల్ కిట్లను ఎంపీపీ నల్ల సారిక రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దూరదృష్టితో ఆలోచించి యువకులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండాలని వారికి క్రికెట్ కిట్టు, వాలీబాల్ కిట్టు ఉచితంగా పంపించారని అన్నారు. 22 గ్రామాలకు 22 క్రికెట్ కిట్లు, 22 వాలీబాల్ కిట్లు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండల యువకుల తరపున సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పిటిసి జగన్ కు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్ వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రెటరీలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## పాలకుర్తి కాంగ్రెస్‌లోకి జోరుగా చేరికలు

- 200 మంది బీఆర్ఎస్‌నాయకుల చేరిక
- కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించిన హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

**పాలకుర్తి, విశాల భారతి :** పాలకుర్తి నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్‌పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి వలసలు కొనసాగుతున్నాయి. జనగాం జిల్లా.. పాలకుర్తి మండలం.. కొండాపురం గ్రామ పరిధిలోని పెద్దతండాలో బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో కొండాపురం మాజీ సర్పంచ్ మంగ శ్రీశైలం, ధారవత్‌వెంకటమ్మ, వాత్రు నాయక్, లావుడ్యా రాందన్ నాయక్, లావుడ్యా బిచ్చు జోగ్య, బిపోజీ మంగ ,అంజమ్మ, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి , కత్తుల కొమురయ్య, బానోత్ హరియా, బాధవాత్ శారీరం , శ్రీను తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు దాదాపు 200 మంది చేరారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ మండల పార్టీ అధ్యక్షుడు గిరగాని కుమార స్వామి గౌడ్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు, లావుడ్యా భాస్కర్ నాయక్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గాదెపాక భాస్కర్ మాదిగ బీసీ సెల్ అధ్యక్షుడు, భైకాని ఐలేష్ యాదవ్ ఇరు గ్రామాల పార్టీ అధ్యక్షులు లావుడ్యా బలోజీ మంగ అంజయ్య మండల నాయకులు గడ్డం యాక సోమయ్య బానోత్ రమేష్ నాయక్ యువజన నాయకులు సోమ శ్రీకాంత్ గడ్డం బాబు దేవేందర్ తదితర ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు





## జనహిత అన్నపూర్ణ 200వ అన్నదాన కార్యక్రమం

- ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య

**బెల్లంపల్లి, విశాల భారతి:** జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం 200వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య మాట్లాడుతూ.. అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని, నిత్యం వివిధ పనుల మీద బెల్లంపల్లి పట్టణానికి వచ్చే నిరుపేదలు, బాటసారులు, యాచకుల ఆకలి తీర్చడం గొప్ప విషయమని అన్నారు అలాగే 200వ సారి అన్నదాన కార్యక్రమం నిర్వహించిన జనహిత సభ్యులు, దాతలని అభినందించారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ అన్ని దానాల్లోకి అన్నదానం గొప్పదని ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడం సంతోషంగా ఉందని అన్నారు. దాతల సహకారంతో జనహిత అన్నపూర్ణ అన్నదాన కార్యక్రమం ఉగాది సందర్భంగా ఏప్రిల్ 13 వ తేదీ 2021 న ప్రారంబించడం జరిగిందని తెలిపారు. దాతల సహకారంతో ప్రతి బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఇప్పటి వరకు దాతల సహకారంతో సుమారుగా 14 లక్షల వ్యయంతో 200 సార్లు అన్నదాన కార్యక్రమం నిర్వహించి కొన్ని వేల మంది ఆకలి తీర్చడం సంతోషకరమని అన్నారు. ఇందుకు సహకారం అందించిన అన్నదాతలు, జనహిత అన్నపూర్ణ శాశ్వత అన్నదాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మందికి అన్నదానం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గెల్లి రాజలింగు, రాములు నాయక్, నాయకులు ఎలిగేటి శ్రీనివాస్, రాజులాల్ యాదవ్, సూరం బానేశ్, చిట్యాల మధు, జనహిత అన్నపూర్ణ శాశ్వత అన్నదాతలు, జనహిత సభ్యులు పాల్గొన్నారు.



## ప్రధాని మోడీపై సంచలన వ్యాఖ్యలు చేసిన మంత్రి వేముల

**బాల్కొండ, విశాల భారతి:** ఇటీవలే జరిగిన నిజామాబాద్ సభలో ప్రధాని మోడీ పచ్చి అబద్ధాలు మాట్లాడాడని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసిఆర్ పై ప్రధాని మోడీ అవినీతి ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ముఖ్య మంత్రి స్థాయి వ్యక్తి మీద ప్రధాని స్థాయి వ్యక్తి ఆరోపణలు దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. సీఎం కేసిఆర్ పై చేసిన అవినీతి ఆరోపణలకు ఆధారాలు చూపెట్టకుంటే మోడీ యావత్ తెలంగాణ సమాజానికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అసలు మోడీనే అత్యంత అవినీతి పరుడని అంతర్జాతీయ మీడియా సంస్థలు కోడై కూస్తున్నాయన్నారు. ప్రధాని మోడీ సచ్చిలుడైతే అవి అబద్ధాలు అని నిరూపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఒక్కో ఎమ్మెల్యేకు 100 కోట్లు పెట్టి కొంటామని బీజేపీ పంపిన స్వాములు వీడియో రికార్డు మాటలు దేశమంతా చూసిందని అన్నారు. మంత్రి కేటీఆర్ సీఎం కావడానికి మోడీ బోడి ఆశీర్వాదం అవసరం లేదని, మాకు 100 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని సీఎం కావడానికి 60 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం సరిపోతుందని అన్నారు.



## కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించిన ఝాన్సీరెడ్డి

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండల కేంద్రంలో నూతన కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌ను కాంగ్రెస్‌పార్టీ పాలకుర్తి నియోజక వర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి బుధవారం ప్రారంభించారు. అంతకుముందు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి గౌడ్ అధ్వర్యంలో ప్రధాన చౌరస్తా నుంచి పటాకులు పేల్చుతూ ర్యాలీగా పార్టీ ఆఫీస్‌కు భారీగా తరలివచ్చారు. పార్టీ ఆఫీస్‌ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయా పార్టీల నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి ఝాన్సీరెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



## బిక్షాటన చేసి నిరసన తెలిపిన ఆశా కార్యకర్తలు

**ధర్పల్లి, విశాల భారతి:** ధర్పల్లి మండల కేంద్రంలో ఆశా కార్యకర్తలు గత పది రోజుల నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రతి కిరణా షాపు తిరుగుతూ భిక్షాటన చేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. నెలసరి వేతనం 18 వేల రూపాయలకు పెంచుతూ, పిఎఫ్, ఈఎస్ఐ వర్తింపచేయాలని తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పిట్ల స్వప్న, నిరీక్షణ, కల్యాణి, సుజాత, లావణ్య,సావిత్రి ,రమ,సత్యగంగు,లక్ష్మి,లావణ్య,మమత,సుకన్య,కృష్ణవేణి, సంధ్య రాని, సుకన్య,జ్యోతి,ఉమ రాని, కృష్ణవేణి,సుమలత,రూపకల, కవిత,జమున, వివిధ గ్రామాల ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైన బెల్లంపల్లి విద్యార్థులు

బెల్లంపల్లి, విశాల భారతి: మంచిర్యాల జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక అయిన బెల్లంపల్లి పట్టణ విద్యార్థులను బుధవారం స్థానిక ఎఎం సి గ్రౌండ్స్ వద్ద బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అభినందించి సత్కరించారు. ఇటీవల మంచిర్యాలలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్ ) క్రికెట్ పోటీలలో అండర్ 14 విభాగంలో ఎ. కుందన్ (సెయింట్ ఆంథోనీ స్కూల్ ), ఆర్. అభినవ్ (శ్రీ ఉషోదయ స్కూల్ ), ఆర్. రిత్విక్ (శ్రీ చైతన్య స్కూల్ ), టి. పవన్ సుత ( సెయింట్ ఆంథోనీ స్కూల్ ), అండర్ 17 విభాగం లో సాత్విక ( ఎస్ ఆర్ గాయత్రి కాలేజీ ) ప్రతిభ కనబరచి నిర్మల్ లో జరుగబోయే జోనల్ పోటీలకు ఎంపిక అయ్యారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ జట్టు కోచ్ ఎం.ఎ. విజయ్, సీనియర్ క్రీడాకారులు సి హెచ్. వేణు, ఆర్. శ్రీనివాస్, ఆర్ తిరుపతి ఎం ఉమా మహేష్, టి. గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణ పతక విజేతగా నిలిచిన లిటిల్ ఫ్లవర్ విద్యార్థిని

**బాల్కొండ, విశాల భారతి:** నిజామాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన ఖోఖో టోర్నమెంట్ లో భీమ్‌గల్ పట్టణానికి చెందిన లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థిని డి.ప్రణిత స్వర్ణ పతకం సాధించింది. ఈ టోర్నమెంట్ మంగళవారం బాల్కొండ ప్రభుత్వ పాఠశాలలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వర్ణ పతక విజేతగా నిలిచిన ప్రణితను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ షఫీ,డైరెక్టర్ సన,ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్ నాయర్,వైస్ ప్రిన్సిపాల్,పిఇటి ప్రశాంత్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.





## ప్రణాళిక బద్ధంగా మున్సిపాలిటీ అభివృద్ధి

**ఆమనగల్లు, విశాల భారతి :** ఆమనగల్లు మున్సిపాలిటీలోని ఆరో వార్డులోని సాయి నగర్ కాలనీలో రూ.14 లక్షలతో 260 మీటర్లు నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు ఆ వార్డు కౌన్సిలర్ దివ్య శ్రీకాంత్ సింగ్ లతో కలిసి చైర్మన్ రాంపాల్ నాయక్, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారిలు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు ప్రణాళిక బద్ధంగా కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దుర్గయ్య, మాజీ జెడ్పిటిసి కండే హరిప్రసాద్, కోఆప్షన్ మెంబర్ పాష, శ్రీధర్, గజ్జె యాదమ్మ, తోట యాదయ్య, దేవ్ సింగ్, సత్యం సింగ్, గుజ్జరి శీను, పాతకోట వెంకటయ్య, లక్ష్మణ్ సింగ్, సంకోజు శ్రీశైలం, నారాయణ, పల్లె వెంకటయ్య, పల్లె శ్రీను, పల్లెబాలయ్య, గజ్జె శ్రీనివాస్, గజ్జె రాఘవేందర్, సీతారాం నాయక్, పాల్గొన్నారు.



## ఆశా వర్కర్లకే ఆరోగ్య భద్రత లేకపోవడం అన్యాయం

**నారాయణఖేడ్, విశాలా భారతి:**నారాయణఖేడ్ లోని ఆశా వర్కర్ల సమ్మె శిబిరాన్ని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప సందర్శించారు. ఈ మేరకు మహిళల ఆరోగ్యం కోసం ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యం కోసం అనునిత్యం కష్టపడే ఆశా వర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని సంగప్ప తప్పు పట్టారు. దాదాపు రెండు వారాలుగా ఆశా వర్కర్లు సమ్మె చేస్తుంటే వాళ్లను చర్చలకు పిలవకపోవడం దుర్మార్గమని సంగప్ప అన్నారు. ఆశా వర్కర్లకు ఆరోగ్య భద్రత, ఉద్యోగ భద్రత ఉండాల్సిందే అని డిమాండ్ చేశారు. సంగప్ప వెంట బిజెపి నాయకులు సాయిరాం, పట్నం మాణిక్, సతీష్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.



## మాజీ సర్పంచ్ ను పరామర్శించిన నాగేష్ షేట్కార్

**నారాయణఖేడ్, విశాల భారతి**:నారాయణఖేడ్ నియోజకవర్గంనాగల్గిద్దా మండల్ గోదేగమ్మ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ శంకరప్పాకి గత కొద్ది రోజుల క్రితం బైక్ ప్రమాదం జరిగింది. ఈ విషయం తెలుసుకొని బుధవారం వారి ఇంటికి నాగేష్ షేట్కార్ వెళ్లి శంకరప్పాను పరామర్శించి ధైర్యం చెప్పరు. ఇందులో నాగల్గిద్దా మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాణిక్ రావు పటేల్, గ్రామనికి చెందిన బస్వారాజ్, బస్వారాజ్ పటేల్, నిరంజన్ పటేల్, విర్ శెట్టి, ఉస్మాన్, సిద్దు ఇతరులు పాల్గొన్నారు

## ఆర్కే న్యూ టెక్ గని పర్యావరణ కార్యక్రమాన్ని నిర్వహించిన సింగరేణి యజమాన్యం



**బెల్లంపల్లి, విశాల భారతి** మంచిర్యాల జిల్లా శ్రీ రాంపూర్ ప్రగతి స్టేడియం ఏరియా నందు ఆర్కే న్యూటెక్ గని పర్యావరణ కార్యక్రమాన్ని సింగరేణి యాజమాన్యం నిర్వహించడం జరిగింది. దీనిని ఉద్దేశించి అనుబంధ కార్మిక సంఘం ఎస్ సి ఎల్ యు స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ గద్దల నారాయణ మాట్లాడుతూ.. పర్యావరణ అభివృద్ధి కోసం 1983 నుండి ఇప్పటివరకు సుదీర్ఘకాలం పాటు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్పాదిక లాభాలతో పేరు పొందిన ఆర్కే న్యూటెక్ గనికి సంబంధించి పర్యావరణ పునర్ ధ్రువీకరణకు సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ శబ్ద కాలుష్యం నీటి సమస్య మరి ముఖ్యంగా ఆ ప్రాంతంలో పంటల సమస్య వీటన్నిటికీ ఆటంకం కలుగకుండా కృషి చేయాలని సింగరేణి అధికారులను కోరారు. అలాగే అవుట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికులను ఉద్దేశించి తక్షణమే పర్మనెంట్ చేసి హై పవర్ వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు.



## బిజెపి వస్తేనే తండాల అభివృద్ధి సాధ్యం

**నారాయణఖేడ్, విశాల భారతి:**రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు అన్ని విధాలుగా మోసం చేసిందని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జనవాడే సంగప్ప విమర్శించారు. సంగారెడ్డి జిల్లా నాగిల్ గిద్ద మండలంలోని పలు తండాల్లో పర్యటించారు. శ్యామా నాయక్ తండ, సక్రు నాయక్ తండా, లోక్యానాయక్ తండాలలో పర్యటించిన సంగప్ప అక్కడి ప్రజల వెనుకబాటుకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. ఇప్పటికీ ఆయా తండాల్లో సరైన రోడ్డు మార్గం లేకపోవడం, ఎలాంటి అభివృద్ధి ఫలాలు ఆ గ్రామాలకు అందకపోవడానికి కుటుంబ పాలనే కారణమని ఆయన ఆరోపించారు. బిజెపి వస్తేనే తండాలు బాగుపడతాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సాయిరాం, దిగంబర్ పాటిల్, పట్నం మాణిక్, సగనాకర్, సతీష్ తదితరులు ఉన్నారు.

## మంత్రి హరీష్ రావును భర్తరఫ్ చేయాలి




**నారాయణఖేడ్, విశాల భారతి:**సిద్దిపేట రైల్వే రైలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో టెలివిజన్ ను బూటు కాలుతో తన్నిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావును ప్రభుత్వం వెంటనే బర్తరఫ్ చేయాలని పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు కోనం విట్టల్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి పదవి హోదా మరిచి, కేంద్ర ప్రభుత్వం ద్వారానే సిద్దిపేట వరకు రైలు వచ్చిందనే విషయాన్ని హరీష్ రావు మర్చిపోయాడన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పై అమర్యాదగా ప్రవర్తించడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రభుత్వం వెంటనే మంత్రి హరీష్ రావు పై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రెస్ మీట్ లో మండల బిజెపి నాయకులు బండల శ్రావణ్, దమ్మ సాయిలు, బొగడాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# యువత ప్రతిపక్షాల మాయ మాటల మత్తులో పడొద్దు

- **మంచి.. చెడు.. అభివృద్ధిపై ఆలోచన చేసే శక్తి మీకుంది**



**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలోని తండాలు, గ్రామాల్లో సుమారు 40 కోట్ల వ్యయంతో చేపట్టే పనులకు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసిఆర్ సహకారంతో బాల్కొండ నియోజకవర్గంలో గత కొద్ది నెలలుగా వందల కోట్లతో అభివృద్ధి పనుల పరంపర కొనసాగుతుందని అన్నారు. బుధవారం ఒక్కరోజే సుమారు 40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామని తెలిపారు. కొంత మంది కేంద్ర నిధులు అని అజ్ఞానంతో అసత్యాలు మాట్లాడుతున్నారని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టిన టాక్స్ నుంచి తిరిగి కొన్ని నిధులు రాష్ట్రానికి ఇస్తారని అది అన్ని రాష్ట్రాలకు హక్కుగా ఇచ్చేవే అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.100 పన్ను చెల్లిస్తే అభివృద్ధి కోసమని రూ.40 మాత్రమే కేంద్ర ప్రభుత్వం నుండి తిరిగి ఇస్తారని ఉదహరించారు. బాల్కొండ నియోజకవర్గంలో తాను అభివృద్ధి కోసం వేసిన శిలాఫలకాలు లెక్కపెట్టడానికే ప్రతిపక్షాలకు 5ఏళ్లు పడుతుందని ఎద్దేవా చేశారు. బీజేపీ,కాంగ్రెస్ యువతను తప్పుదోవ పట్టిస్తున్నారని,యువత వారి మాయ మాటల మత్తులో పడొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డా. మధుశేఖర్, డిసిసిబి వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి,రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు,స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పార్టీ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.




## కళ్లకు గంతలు కట్టి నిరసన తెలిపిన మధ్యాహ్న భోజన కార్మికులు

**ధర్పల్లి, విశాల భారతి:**మండల పరిషత్ కార్యాలయం ముందు గత 15 రోజులుగా మధ్యాహ్న భోజన కార్మిలు సమ్మెలో పాల్గొంటున్నారు. బుధవారం కళ్లకు గంతలు కట్టుకొని మౌనం పాటిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు శారద మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులతో ప్రభుత్వం గత 22 సంవత్సరాలుగా వెట్టి చాకిరి చేయిస్తూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతకూ తమ బతుకులు మారలేవని అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు మానసిక ఆర్థిక ఒత్తిళ్లకు గురి అవుతున్నారని.. అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న శ్రమకు దోపిడి గురి అవుతున్నామని తెలిపారు. 2000 రూపాయలు పెంచుతున్నామని చెప్పి సుమారు 2 సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం రెండు వేలు రూపాయలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం కూడా 3000 రూపాయలు పెంచాలి. 40:60 నిష్పత్తి తో పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు శారద, బిల్ల పావని, సునీత, లత, తదితర కార్మికులు పాల్గొన్నారు.



## మంత్రి వేముల చేసిన అభివృద్ధి పై వృద్ధుడి బతుకమ్మ పాట

**బాల్కొండ, విశాల భారతి:** బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మండలంలో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పలు అభివృద్ధి పనుల ప్రారంభ కార్యక్రమాల్లో భాగంగా పర్యటిస్తున్న సందర్భంగా పల్లికొండ గ్రామం మీదుగా వెళ్తుండగా బిఆర్ఎస్ నేత గంఘం కిషన్ ఇంటి వద్ద ఆగారు. మంత్రి వేముల చేసిన అభివృద్ధిపై అదే గ్రామానికి చెందిన వృద్ధుడు మేకల(గంఘం)రాజన్న బతుకమ్మ పాట పాడి మంత్రికి వినిపించాడు. తనపై అభిమానంతో బతుకమ్మ పాట రూపొందించిన రాజన్నను మంత్రి వేముల శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. రాజన్న అనేక సామాజిక అంశాలపై పాటలు రూపొందించాడని తెలుసుకున్న మంత్రి ఆయన పాటలన్నీ బుక్ ముద్రణ వేయిస్తనని హామీ ఇచ్చారు. సామాజిక స్పృహ కలిగిన పాటలు పుస్తక రూపంలో, ఆడియో రూపంలో నిక్షిప్తమై ఉంటే ఎక్కువ మందికి చేరుతాయని, భవిష్యత్ తరాలకు ఉపయోగపడతాయి అని అన్నారు.

## నాటు సారా పట్టివేత...కేసు నమోదు



**ఆమనగల్లు, విశాల భారతి** :అక్రమంగా తరలిస్తున్న నాటు సారాను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ బద్యనాథ్ చౌహన్ అన్నారు. ఆమనగల్లు నాగిళ్ళ మార్గమధ్యలో తరలిస్తున్న 4.5లీటర్ల నాటు సారాను పట్టుకొని, అక్రమంగా నాటుసారా తరలిస్తున్న కాటగాని తండాకు చెందిన వద్యా వత్ రాజును అరెస్ట్ చేసి అతని నుండి పల్సర్ బైక్ ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.



## బీఆర్ఎస్ లోకి కాంగ్రెస్ యువజన నాయకులు

- **మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో చేరిక**

**పాలకుర్తి , విశాల భారతి:** జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గ మండలం అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు పలువురు మంత్రి ఎర్రబెల్లి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు పార్టీ లో చేరిన వారిలో ఆ గ్రామ యువజన కాంగ్రెస్ నాయకుడు ముస్కు కుమారస్వామి ముస్కు యాకన్న అనుముల మహేందర్ ఈ కార్యక్రమంలో గ్రామ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




## మహిళలు అడ్వాన్సుడ్ ఫ్యాషన్ డిజైనింగ్ తో ఆర్థిక అభివృద్ధి సాధించాలి

- **శిక్షణ ప్రారంభోత్సవంలో నాబార్డ్ ఏజీఎం మనోహర్ రెడ్డి**

**రాయికల్, విశాల భారతి:**అడ్వాన్స్డ్ ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణతో మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలని నాబార్డ్ ఏజీఎం మనోహర్ రెడ్డి తెలిపారు. బుధవారం జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో నాబార్డ్ వారి సౌజన్యంతో జనవికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 90మంది స్వశక్తి మహిళలకు అడ్వాన్సుడ్ ఫ్యాషన్ డిజైనింగ్ పైన శిక్షణ కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని నాబార్డ్ ఏ జి యం పి మనోహర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అధునాతన మోడల్ లో శిక్షణ 20రోజులపాటు 90మంది స్వశక్తి మహిళలకు అల్లీపూర్, సింగరావుపేట, కిష్టంపేట గ్రామాల స్వశక్తి మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రతి ఒక్క మహిళ సమయపాలన పాటిస్తూ ప్రజెంట్ సిచువేషన్ కనుగొనగా కొత్త కొత్త డిజైన్స్ క్రాస్ బ్లౌజ్ నెక్ బ్లౌజ్ రౌండ్ నెక్ వీటితోపాటు నూతన డిజైన్లను మాస్టర్ ట్రైనర్లు శిక్షణ ఇస్తారని వివరించారు. ఈ శిక్షణ కాలంలో వారికి వెయ్యి రూపాయల స్టైఫెండ్ తో పాటు సర్టిఫికెట్ ను కూడా అందించడం జరుగుతుందన్నారు. అలాగే మరో అతిథి లీడ్ బ్యాంకు మేనేజర్ పి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణ అనంతరం జేఎల్జి గ్రూపులుగా ఏర్పాటు చేసి స్వసక్తి మహిళలకు బ్యాంకుల ద్వారా యూనిట్ పెట్టు కొనుటకు రుణ సదుపాయాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం చక్రవర్తి, జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ సీఈవో పెండ్లి సంపత్ కుమార్, ఎపిఓ చైర్మన్ ఏ శంకర్, సర్పంచ్,ఎంపీటీసీ లతోపాటు 90మంది స్వశక్తి మహిళలు జన వికాస గ్రామీణ అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ పెసరి రాజు,మాస్టర్ ట్రైనర్ మనిషా ,లత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు




## ఆత్మగౌరవ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిన రామంచ మాస్టిన్లు

**చిగురుమామిడి, విశాల భారతి:** హైదరాబాదులో నిర్వహించిన ఎస్సీ 57వ ఉపకులాల ఆత్మ గౌరవ సభకు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రామంచ గ్రామం నుండి దాదాపు 150మంది మాస్టిన్ కులస్తులు పెద్ద ఎత్తున తరలి వెల్లినట్లు హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ దర్శనం సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జ్ దర్శనం సంపత్ మాట్లాడుతూ మేమెంతో మాకంత అనే నినాదంతో హైదరాబాదులో భారీ బహిరంగ ఆత్మగౌరవ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తమను ఓటు బ్యాంకుగా చూస్తున్నారే తప్ప తమ హక్కుల సాధనకు ఎవరు సహాయం చేయడం లేదన్నారు. రిజర్వేషన్లలో సమానమట కల్పించాలని సంపత్ డిమాండ్ చేశారు. జనాభా తమాషా ప్రకారం శాస్త్రీయంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని వారు ప్రభుత్వాలను కోరారు. ఎస్సీలకు ఇచ్చిన విధంగానే కుల ధ్రువీకరణ పత్రాలను తమకు ప్రభుత్వం ఇవ్వాలని, కొన్ని ధ్రువీకరణ పత్రల కోసం జిల్లా మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మగౌరవ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా దర్శనం సంపత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దర్శనం శంకర్, ప్రధాన కార్యదర్శి దర్శనం నరసింహ,జిల్లా ఉపాధ్యక్షులు మాన్యం శేఖర్, కుల సంఘం సభ్యులు దర్శనం చెందు, సారయ్య,రామదాసు,నల్లగొండ రాజయ్య,రవి,స్వామి,శంకర్, సహదేవ్,సంతు,రాజమౌళి, తదితరులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు

## నందమూరి బాలకృష్ణ ను కలిసిన వల్లారపు..



సికింద్రాబాద్,విశాల భారతి: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ టిడిపి ముఖ్య నాయకుల సమావేశం బుధవారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్లో జరిగింది. ఈ సమావేశానికి కాసాని జ్ఞానేశ్వర్ తో కలిసి నందమూరి బాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా టిడిపి సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ వల్లారపు శ్రీనివాస్ నందమూరి బాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. అనంతరం సికింద్రాబాద్లో టిడిపి చేపడుతున్న అనేక కార్యక్రమాలను వివరించి, టిడిపి క్యాడర్ ఉత్సాహంగా పనిచేస్తుందని, ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజా సమస్యల పైన ఎప్పటికప్పుడు పోరాటం చేస్తున్నామని వివరించారు.

# మహిళలకు బతుకమ్మ చీరలు పంపిణీ

- **354 కోట్లు చీరలకు ఖర్చు చేశామన్న మంత్రి ఎర్రబెల్లి**



**పాలకుర్తి , విశాల భారతి :** జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని మంత్రి క్యాంపు ఆఫీస్‌లో పంచాయతీరాజ్ శాఖ మంత్రిఎర్రబెల్లి దయాకర్ రావు మహిళలకు బతుకమ్మ చీరలు, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ" ఆడపడుచులకు ఇష్టమైన పండుగ తెలంగాణ రాష్ట్ర బతుకమ్మ పండుగ అని కుటుంబ పెద్దగా బతుకమ్మ పండుగ కానుకను మహిళలకు ఇచ్చే కొత్త సంప్రదాయాన్ని తెలంగాణ రాష్ట్రం వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ మొదలుపెట్టారన్నారు. రాష్ట్రంలో ఒక కోటి రెండు లక్షల చీరలు 250 డివిజన్లలో తయారయ్యాయని దీనికిగాను రాష్ట్ర ప్రభుత్వం 354 కోట్ల రూపాయలు చేనేత సంఘాల ఆధ్వర్యంలో ఖర్చు చేస్తుందని ఆయన తెలిపారు. కళ్యాణ లక్ష్మి చెక్కులను 81 మంది లబ్ధిదారులకు 8109396 రూపాయలను పంపిణీ చేశారు. ప్రతి గ్రామ పంచాయితీకి అన్ని రకాల అట వస్తువుల క్రికెట్ కిట్టు లు సుమారు 50000 రూపాయల విలువగల వాటిని పంపిణీ చేశారు. ప్రభుత్వం ఇచ్చే చీరల విలువ చూడొద్దని ఆడపడుచుకు మన రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఇచ్చే సారెగా భావించాలని అన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచి వెలుగొందుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు సాగునీరు మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టిందని ఇప్పటి నుండి సంవత్సరం లోపల దళిత బంధు బీసీ బందు తో పాటు అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని ఆయన తెలిపారు. పాలకుర్తి నియోజకవర్గం లో తాను ఇచ్చిన హామీలు 100% నెరవేర్చానని రాబోయే ఐదు సంవత్సరాలలో రైతులు ప్రజలు ఇబ్బంది పడకుండా నిజ వర్గంలో కోతుల బెడద లేకుండా చేసే బాధ్యత తన మేనిఫెస్టోలో పెట్టి కోతులు లేకుండా గ్రామాలు వుండే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. దయన్న అంటే ఇచ్చే మాట నిలబెట్టుకునే మనిషని మీ అందరికీ తెలుసని తాను నియోజక వర్గంలో 50 వేల పైచిలుకు మెజార్టీతో మీ అందరి ఆశీర్వాదంతో గెలుపొందడం ఖాయమని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక ప్రజాప్రతినిధులు ముఖ్య నాయకులు అధికారులు మహిళా సంఘాల ప్రతినిధులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

**నడిగూడెం, విశాలభారతి:**మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన నిర్వహణ కార్మికులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. బుధవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యేను కలిసి పెంచిన వేతనాలు అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి బెల్లం కొండ సత్యనారాయణ, సిఐటియు మండల కన్వీనర్ మల్లెల ఎంకన్న ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మణమ్మ, ఉమా, ఉపేంద్రమ్మ, అంజమ్మ, ధనమ్మ, ఈశ్వరమ్మ, నాగమణి,నాగమ్మ, అలివేలు, సైదాబీ తదితరులు పాల్గొన్నారు




## వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

**విశాల భారతి :** వన్యప్రాణి వారత్సవాలలో భాగంగా అటవి శాఖ ఆధ్వర్యంలో మణుగూరులో బైక్ ర్యాలీ ప్రదర్శన, మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మణుగూరు రేంజర్ ద్వాలియా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వన్యప్రాణులను సంరక్షించాలి , అలాగే ఇప్పటివరకు ఉన్న పుణ్యప్రాణులను కాపాడుకోవాలన్నారు, వణ్యప్రాణులను సంరక్షించడం అందరి బాధ్యత అని తెలిపారు. అడవులు మానవ మనుగడకు ఎంతో అవసరమని అటవీ జంతువులకి హాని కలిగించరాదని జంతువులను చంపడం, వేటాడడం చేస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.



## సర్వేల్‌లో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల లీడర్లు

**నారాయణపురం, విశాల భారతి:** సర్వేల్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్ పార్టీ ప్రవేశ పెడుతున్న అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం బీఆర్ఎస్‌పార్టీలో చేరారు. చేరిన వారిలో కట్టెల మహేష్, కట్టెల వెంకటేష్, వరికుప్పల ఐలేష్ , వరికుప్పల రవి, వరికుప్పల రాజశేఖర్ చేరారు. ఈ కార్యక్రమంలో నారాయణపురం జడ్పీటీసీ మెంబర్‌వీరమల్ల భానుమతి వెంకటేశం గౌడ్, సర్వేల్ సర్పంచ్ కట్టెల భిక్షపతి,ఎంపీటీసీ ఈసం యాదయ్య, ఎంపీటీసీ2 నర్రి పావని నర్సింహ, జిల్లా నాయకులు నలపరాజు స్వామి, బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గం అధ్యక్షుడు నలపరాజు రమేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు వీరమల్ల జంగయ్య,వర్దం శేఖర్,వర్దమ్ నాగార్జున, వరికుప్పాల శ్రీను,చీలకరాజు శ్రీను పాల్గొన్నారు



## భోజనం వర్కర్ల పెండింగ్ బిల్లు వెంటనే చెల్లించాలి

- **జడ్పటీసీ బెల్లం శ్రీనివాస్**

**తిరుమలయపాలెం, విశాల భారతి**తిరుమలాయపాలెం మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన వర్కర్లు గత ఆరు రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం దుర్మార్గమని తిరుమలయపాలెం జడ్పిటిసి బెల్లం శ్రీనివాస్ అన్నారు బుధవారం మండల కేంద్రంలో తమ హక్కుల సాధనకై నిరాహార దీక్ష చేస్తున్న మధ్యాహ్న భోజనాలు వర్కర్ల సమ్మె శిబిరానికి వెళ్లి వారిని పరమార్శించి సంఘీభావం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు మరియు వారి డిమాండ్లను వెంటనే ప్రభుత్వం పరిష్కరించి వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువమంది దళిత పేద కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు కాబట్టి వారు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందని వారు ఈ సందర్భంగా తెలియజేశారు వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం పరిష్కరించేంతవరకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా వారికి ఉంటుందని భారత రాజ్యాంగం ప్రకారము సమ్మె చేసుకునే హక్కు మరియు హక్కులను సాధించుకునే వరకు పోరాటం చేయటం కార్మిక లోకానికి తప్పనిసరి పరిస్థితి అయిందని బంగారు తెలంగాణలో కూడా సమ్మెలు చేసే దుస్థితి నెలకొన్నదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు వసపొంగు వీరన్న, మధ్యాహ్న భోజన కార్మికుల అధ్యక్ష కార్యదర్శులు నాయని పద్మ, ప్రమేల, సంతోష, ఉపేంద్ర, వివిధ గ్రామాల నుంచి వచ్చినటువంటి మధ్యాహ్న భోజన కార్మికులందరూ పాల్గొన్నారు.



## కంకర పరిచిన్రు.. తారు వేయడం మరిచిన్రు..!

- **అసంపూర్తిగా వదిలి వేసిన రోడ్డుపై ప్రయాణికుల అవస్థలు**
- **వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్**
- **సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధారావత్ శంకరనాయక్**

**దేవరుప్పుల, విశాల భారతి:** దేవరుప్పుల మండలంలోని ధర్మ పురం నుంచి పుట్టి గుట్ట తండా వరకు కనెక్టివిటీ రోడ్లు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. దీంతో స్థానికులు, రైతులు అవస్థలు పడుతున్నారు. బుధవారం వారి ఇబ్బందులను మీడియాకు వివరిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు ధరావత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ ధర్మ పురం లాకావత్ తండా సమీపం నుండి పుట్టి గుట్ట తండా వరకు రెండు కిలోమీటర్ల వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంవత్సరం క్రితము ప్రారంభించి కంకర పరిచి అసంపూర్తిగా వదిలివేసి కనీసం రోడ్ రోలర్ తొక్కియకుండా వదిలివేయడంతో కంకర తేలి ఉండడంతో ఈ రహదారి గుండా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు మరియు ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు నడిపే క్రమంలో కంకర రాళ్లు అడ్డు తగిలి అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు వాహనాలు వెళ్లేటప్పుడు కంకరాలు ఎగురొచ్చి తగిలి గాయాల పాలవుతున్నారు ఎదురు ఎదురు వచ్చే వాహనా నుండి తప్పించే క్రమంలో బ్రేకులు వేస్తే వాహనాలు అదుపుతప్పి క్రిందపడి గాయాలకు గురవుతున్నాము వాహనాల టైర్లు సైతం పాడైపోతున్నాయి వాహనాలు వస్తున్న క్రమంలో దుమ్ము, ధూళి లేసి కళ్ళలో పడి చాలా అవస్థలు పడుతున్నాము అని ఆవేద వ్యక్తం చేస్తున్నారు సంబంధిత శాఖ అధికారులు మరి కాంట్రాక్టర్లు ఎందుకు ఆలస్యం ప్రదేశిస్తున్నారు అర్థం కాని పరిస్థితి పనులు పూర్తిగా అవడానికి ఎన్ని నెలల్లో పడుతుందో సందేహాన్ని వ్యక్తం చేస్తున్నారు ప్రజలు వాహనదారులు ఎదుర్కొన్న ఇబ్బందులను గుత్తి దారులు అధికారులు లైట్ తీసుకుంటున్నారు సంబంధిత అధికారులు గుత్తి దారులు వెంటనే స్పందించి పనులు పూర్తి చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్ డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల నాయకులు ధరావత్ స్వామి, స్థానిక ప్రజలు లావుడియా సురేందర్ అజ్మీర అజయ్ ,లాకావత్ చంద్రు ,సుజాత, జాటోత్ కోమాలి పద్మ ,సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలకు ‘డబుల్’ ఇండ్లు పంచాలి

**శాలిగౌరారం, విశాల భారతి:** శాలిగౌరారం మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీని అధికార పార్టీ సర్పంచ్ అర్హులకు కాకుండా అనర్హులకు ఇప్పించాలని కుట్ర చేస్తున్నారని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్వోను కలిసి తక్కెళ్ళపాడు గ్రామంలో గ్రామ సభను ఏర్పాటు చేసి అర్హులైన పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తీర్పరు మల్లయ్య,ఎంపీటీసీ నక్క శంకరమ్మ మల్లేష్,మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య ,బిసి సెల్ జిల్లా కార్యదర్శి నిమ్మల కృష్ణమూర్తి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాకాల సతీష్, మండల సీనియర్ నాయకులు బోడ దానయ్య,గరిగంటి శంకర్, మిరియాల భాస్కర్, ఎన్ ఎస్ యుఐ మండల ఉపాధ్యక్షుడు కట్లకుంట్ల రమేష్ భాషబోయిన అంజి, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## గొత్తి కోయ గ్రామాలు తనిఖీ

- **వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా కోయలకు సూచనలు**

**అశ్వాపురం, విశాల భారతి :** అక్టోబర్ రెండు నుంచి ఎనిమిదో వ తేదీ వరకు వన్యప్రాణి సంరక్షణా వారోత్సవాలు జరుగనున్నాయి అని అశ్వాపురం రేంజర్ రమేష్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం నాడు మండల కేంద్రంలో గల గొత్తి కోయ గ్రామాలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులను,వన్య ప్రాణులను రక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదని అన్నారు. అడువులకు దగ్గరగా ఉండే ప్రాంతాల ప్రజలు గొత్తి కోయలు ఎలా ఉండాలి. వారు వన్యప్రాణులను వేటాడి పట్టుకోవడం,అడవులను అక్రమంగా నరకడం, వన్యప్రాణులను కరెంట్ తీగలు అమర్చి చంపడం, ఉచ్చులు పెట్టడం, ఇవన్నీ కూడా చట్టాలకు విరుద్ధంగా చేయడం వాటి వల్ల కలిగే అనర్థాలు ఎలా ఉంటాయో వారికి అవగాహన కల్పించారు. అలాగే వన్యప్రాణులను వెంటాడితే ప్రభుత్వం వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని అటవీ చట్టాల గురించి ఆయా గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, సెక్షన్ ఆఫీసర్స్, బేస్ క్యాంపు సిబ్బంది తదతరులు పాల్గొన్నారు.



## బతుకమ్మ చీరలు, ఆటల పరికరాల పంపిణీ

**నడిగూడెం, విశాలభారతి:**నడిగూడెం మండల ప్రజా పరిషత్ ఆఫీస్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతకమ్మ ఆటల సమయంలో నిరుపేద మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ కార్యక్రమాన్ని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ అన్ని మతాల వారికి వివిధ సమయాల్లో రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండి వారి వారి పండగలకు తోడుగా ఉంటుందన్నారు అదేవిధంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి దానికి అనుగుణంగా ఆయా గ్రామాల్లో వివిధ రకాల ఆటో వస్తువులను పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు స్పెషల్ ఆఫీసర్ సతీష్ ,ఎంపీడీవో ఎం ఎర్రయ్య, ఎంపీ ఓ లింగారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు ,ఎంపీటీసీలు, కార్యదర్శులు, వివిధ హోదాలో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పార్ట్ టైం లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

- **ప్రిన్సిపాల్ స్వప్నకుమారి**



**మణుగూరు, విశాల భారతి :** తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల మణుగూరు మిట్టగూడెం నందు వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న పార్ట్ టైం అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న కుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిజిక్స్ 1, బాటని 1, మ్యాథ్స్ 1, పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఈనెల 5 తేదీ నుండి 7 తేదీ వరకు ఆసక్తి అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పీజీలో 55శాతం ఉత్తీర్ణత కలిగి సెట్, నెట్ , పీహెచ్డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, డెమో క్లాసు ఈనెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు హాజరుకావాలని, దరఖాస్తులకు ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ మరియు ఫోటోలు తీసుకొని రావాలని, ఇతర వివరాలకు 7901097698, 9550406691 ఫోన్ నెంబర్లకు సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని అన్నారు




## సర్వోత్తమ రెడ్డి భౌతిక కాయానికి నివాళి

- **టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి**

**శాలిగౌరారం, విశాలభారతి**:శాలిగౌరారం మండల కేంద్రంలో పీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పెద్ద నాన్న చామల సర్వోత్తమ్ రెడ్డి మృతి చెందారు. ఈ సందర్భంగా విషయం తెలుసుకున్న టీపీసీసీ ఉపాధ్యక్షులు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు అన్నెబొయిన సుధాకర్ బుధవారం సర్వోత్తమ రెడ్డి భౌతిక కాయానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించి అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తమ పరగాడ సానుభూతి సొంతమాని వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నక్క శంకరమ్మ మల్లేష్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తీరుపాటి మల్లయ్య , మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య,బిసి సెల్ జిల్లా కార్యదర్శి నిమ్మల కృష్ణమూర్తి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాకాల సతీష్, మండల సీనియర్ నాయకులు బోడ దానయ్య, గరిగంటి శంకర్, మిరియాల భాస్కర్, ఎన్ ఎస్ యుఐ మండల ఉపాధ్యక్షులు కట్లకుంట్ల రమేష్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు కొకసాయి, మాదగొని దామోదర్, భాషబోయిన అంజి, సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధి వినాయక ఆలయంలో దీక్షను పూర్తి చేసిన గ్లోబల్ స్టార్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సినిమాల్లో ఎంత స్టైలిష్‌గా కనిపిస్తారో బయట అందుకు భిన్నంగా చాలా సింపుల్‌గా ఉంటారు. అయ్యప్ప స్వామికి ఆయన పెద్ద భక్తుడు కూడా. ప్రతీ సంవత్సరం అయ్యప్ప స్వామి మాలను వేసి దీక్షను తీసుకుంటుంటారనే సంగతి తెలిసిందే. ఈ ఏడాది కూడా ఆయన అయ్యప్ప దీక్షను తీసుకున్నారు. ఈ దీక్షను ముంబైలో సిద్ధి వినాయక ఆలయంలో పూర్తి చేశారు. రామ్ చరణ్ అచంచలమైన భక్తి విశ్వాసాలకు, నమ్మకానికి ఈ ఆధ్యాత్మిక ప్రయాణం ఓ ఉదాహరణ అని చెప్పొచ్చు. అయ్యప్ప స్వామి దీక్షను పాటించే వారు ఎంత నిష్టగా ఉంటారో మనం గమనిస్తే అర్థమవుతుంది. ఈ సమయంలో రామ చరణ్ కఠినమైన నియమ నిబంధనలను పాటిస్తారు. అయ్యప్ప మాలతో నలుపు రంగు దుస్తులను ధరిస్తారు. చెప్పులను ధరించరు. సిద్ధి వినాయకుని ఆలయంలోకి వెళ్లిన సమయంలోనూ ఆయన ఇదే నియమాలను పాటించటం అనేది అభిమానులను ఆకర్షించింది. వారి హృదయాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్నారు. అలాగే సిద్ధి వినాయకుని ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. అలాంటి ఆలయంలో రామ్ చరణ్ తన దీక్షను విరమించటం అందరి దృష్టిని ఆకర్షించింది. రామ్ చరణ్ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఈ దీక్షను చేస్తుంటారు. ఆర్ఆర్ఆర్, గేమ్ చేంజర్ వంటి భారీ సినిమాల్లో నటించే సమయంలోనూ ఆయన దీక్ష చేయటాన్ని విడిచి పెట్టలేదు. ఈ ఏడాది ఆయన కుమార్తె క్లీంకార రాకతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఓ వైపు వృతిపరమైన విషయాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను బ్యాలెన్స్ చేయటంలో రామ్ చరణ్ తన అంకిత భావాన్ని ప్రదర్శించారు.

# ప్రణీత స్టన్నింగ్ గ్లామర్ డోస్

ఏం పిల్లో ఏం పిల్లాడో సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సొంతం చేసుకున్న అందాల భామ ప్రణీత సుభాష్. పవన్ కళ్యా అత్తారింటికి దారేది, జూనియర్ ఎన్టీఆర్ రభస సినిమాలలో ప్రణీత నటించింది. అయితే తెలుగులో స్టార్ హీరోయిన్ గా మాత్రం ఈ బ్యూటీ సక్సెస్ కాలేకపోయింది. మాతృభాష కన్నడంలో మాత్రం స్టా హీరోయిన్ గా ఎదిగింది. పోకిరి రీమేక్ ద్వారా కన్నడంలోకి హీరోయిన్ గా ప్రణీత ఎంట్రీ ఇచ్చింది. 2021లో ఈ బ్యూటీ పెళ్లి చేసుకొని సెటిల్ అయ్యింది. అయితే పెళ్లి తర్వాత కూడా నటిగా సినిమాలు చేస్తూనే ఉంది. హిందీలో హంగామా2తో ఎంట్రీ ఇచ్చింది. ప్రస్తుతం కన్నడంలో ఒకటి మలయాళంలో ఒక మూవీ సెట్స్ పైన ఉన్నాయి. తెలుగులో చివరిగా హలో గురు ప్రేమకోసమే చిత్రంలో ప్రణీత గెస్ట్ రోల్ లో కనిపించింది సినిమాలలో ఛాన్స్ లు తగ్గిన సోషల్ మీడియా ద్వారా మాత్రం ప్రణీత అందరికి అందుబాటులో ఉంటుంది. ఇ స్టాగ్రామ్ లో రెగ్యులర్ గా తనకి సంబంధించిన అప్డేట్స్ ఇస్తూనే ఉంటుంది. అలాగే హాట్ హాట్ ఫోటోలని ఫ్యాన్స్ కోసం షేర్ చేస్తూ ఉంటుంది. ప్రస్తుతం ప్రణీతకి ఏడాది వయసున్న కూతురు కూడా ఉంది. కూతురుతో ఎక్కువ టైం స్పెండ్ చేస్తూ ఆ వీడియోలని కూడా ఇన్ స్టాగ్రామ్ లో పంచుకుంటూ ఉంటుంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ బ్యూటీ నడుము అందాలు కనిపించే విధంగా స్లీవ్ లెస్ బ్లౌజ్ వేసుకొని గ్లామర్ లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఈ ఫోటోతో కుర్రాళ్ళకి వేడి పుట్టిస్తోంది. కరెక్ట్ గా దృష్టి పెడితే ఇప్పటికి హీరోయిన్ గా కొనసాగేంత ఫీచర్స్ ఉన్నాయని కామెంట్స్ చేస్తున్నారు. కొంతమంది నెటిజన్లు హాట్ అంటూ ఎమోజీలు కూడా పెడుతూ ఉండటం విశేషం. ప్రణీత సుభాష్ అందాలని అందరూ ఫిదా అయిపోతున్నారు. ఈ ఫోటోని ఏకంగా 72,617 మంది వీక్షించడం విశేషం.




# రశ్మిక లాంచ్ చేసిన గం..గం..గణేశా లిరికల్ సాంగ్



"బేబి" సినిమా బ్లాక్ బస్టర్ హిట్ తో హ్యాపీగా ఉన్న ఆనంద్ దేవరకొండ...అదే ఉత్సాహంలో "గం..గం..గణేశా" మూవీతో మరో హిట్ అందుకునేందుకు రెడీ అవుతున్నారు. యాక్షన్ కామెడీ జానర్ తో "గం..గం..గణేశా" సినిమాను హైలైఫ్ ఎంటర్ టైన్ మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ బొమ్మిశెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. "గం..గం..గణేశా" సినిమా నుంచి బృందావనివే లిరికల్ సాంగ్ ను స్టార్ హీరోయిన్ రశ్మిక మందన్న రిలీజ్ చేసింది. ఆనంద్ గత సూపర్ హిట్ ఫిల్మ్ "బేబి"లోని ప్రేమిస్తున్నా సాంగ్ కూడా రశ్మికనే విడుదల చేసింది. ఆ సాంగ్ కంటే బృందావనివే పాట బిగ్ హిట్ కావాలని రశ్మిక బెస్ట్ విశెస్ తెలియజేసింది. తమ సినిమాలోని పాట రిలీజ్ చేసిన రశ్మికకు థాంక్స్ చెప్పారు హీరో ఆనంద్ దేవరకొండ. బ్యూటిఫుల్ మెలొడీ సాంగ్ బృందావనివే మీకు నచ్చుతుందని ఆయన ట్వీట్ చేశారు.

# త్రిపుల్ రోల్ చేయడం నన్ను ఎక్సయిట్ చేసింది



నైట్రో స్టార్ సుధీర్ బాబు, యాక్టర్ -ఫిల్మ్ మేకర్ హర్షవర్ధన్ దర్శకత్వంలో చేస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ మామా మశ్చీంద్ర. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పిపై నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు నిర్మించిన ఈ చిత్రం టీజర్ ట్రైలర్ తో పాజిటివ్ బజ్ ని క్రియేట్ చేసింది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందిన ఈ ద్విభాషా చిత్రాన్ని సృష్టి సెల్యులాయిడ్ సోనాలి నారంగ్, సృష్టి సమర్పిస్తున్నారు. అక్టోబర్ 6న సినిమా విడుదలౌతున్న నేపధ్యంలో హీరో సుధీర్ బాబు విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. నా కెరీర్ లో ఇప్పటివరకూ నా దగ్గరకి వచ్చిన కథల్లో నాకు నచ్చినవి ఎంపిక చేసుకొని చేసినవే. ఫలానా కథ చేయాలని, అలాంటి కథని తయారు చేయించే ప్రయత్నం ఎప్పుడూ చేయలేదు. అయితే తొలిసారిగా హర్ష పై వున్న నమ్మకంతో తనతో వర్క్ చేయాలని కథ చేసుకొని రమ్మని చెప్పాను. తను చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. చాలా డిఫరెంట్ స్క్రిప్ట్. మనం, గుండెజారే గల్లంతైయ్యిందే చిత్రాలతో తను మంచి రైటర్ గా నిరూపించుకున్నారు. తనకి సినిమాలపై మంచి పట్టువుంది. 'మనం' చూసినప్పుడు ఎంత కొత్తగా అనిపించిందో.. మామా మశ్చీంద్ర చూసినప్పుడు కూడా అలాంటి కొత్త అనుభూతిని ఇస్తుంది. త్రిపుల్ రోల్ చేయడం నన్ను ఎక్సయిట్ చేసింది. కృష్ణమ్మ కలిపింది, భాగీ, భలే మంచి రోజు లాంటి చిత్రాలలో డిఫరెంట్ రోల్స్ చేసుకుంటూ వచ్చాను. నేను ఇలాంటి పాత్రలు కూడా చేయగలను అని ప్రేక్షకులు యాక్సెప్ట్ చేశారు. మామ మశ్చీంద్ర లో ట్రిపుల్ రోల్ ని ఒక అవకాశంగా భావించాను. ఇందులో మూడు పాత్రలకు మూడు డిఫరెంట్ యాసలు వుంటాయి. ఒక పాత్ర తెలంగాణ, మరొకటి ఉత్తరాంధ్ర, ఇంకో పాత్రకు రాయలసీమ యాస వుంటుంది. ఈ మూడు యాసలు నావి కాదు. ఓల్డ్ పాత్రకు ఇంకో డబ్బింగ్ వుంటుంది. అది నా రెగ్యులర్ భాష. ప్రతి పాత్రకు వేరియేషన్ వుంది. ఒక పాత్ర కోసం బరువు పెరిగాను. మరో పాత్రకు ప్రోస్తటిక్స్ వాడాం. యంగ్ గా కనిపించే పాత్ర కోసం డైట్ రొటీన్ పాటించాను. ఈ చిత్రం మెంటల్ గా ఫిజికల్ గా ఒక ఛాలెంజ్. నేను కొత్తగా ప్రయత్నిస్తాననే నమ్మకం ప్రేక్షకుల్లో వుంది. మామా మశ్చీంద్ర కూడా తప్పకుండా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇస్తుంది. కంటెంట్ వున్న కమర్షియల్ సినిమా ఇది. ఫ్యామిలీ అంతా కలసి హాయిగా చూడొచ్చు. చాలా మలుపులు, ట్విస్ట్ లు వుంటాయి. తొలిసారి ప్రోస్తటిక్ వాడటం పాయా డిఫరెంట్ ఎక్స్ పీరియన్స్. నిజానికి ఒక పాత్ర కోసం బరువు ని రియల్ గా పెంచాలని అనుకున్నాను. అయితే సడన్ గా అంత బరువు పెరగడం మంచిది కాదని మహేష్ బాబు గారితో పాటు సన్నిహితులందరూ చెప్పారు. దీంతో ప్రోస్తటిక్ ని వాడటం జరిగింది. యంగ్ పర్సన్ కి వాడే ప్రోస్తటిక్ మెటిరియల్ చాలా స్టిఫ్ గా వుంటుంది. దీంతో ఫేషియల్ ఎక్స్ ప్రెషన్స్ ని చూపించడంలో కొంత ఛాలెంజ్ వుంటుంది. ఇందులో మాత్రం చాలా మంచి వర్క్ చేశాం. ఆడియన్స్ కి ఎక్కడా కూడా ప్రోస్తటిక్ ఫీలింగ్ రాదు. చాలా సహజంగా కుదిరింది. ఈ విషయంలో చిన్న టెస్ట్ కూడా పెట్టుకున్నాను. మా అపార్ట్మెంట్ కి ఫోన్ చేసి 'ఫలానా వాడు వస్తున్నాడు లోపలకి రానివ్వొద్దని' చెప్పాను.

# అందాల తాప్సీ

బ్యూటిఫుల్ హీరోయిన్ గా చాలా కాలం పాటు తెలుగు ఇండస్ట్రీలో కొనసాగిన తాప్సీ పన్ను స్టార్ హీరోయిన్గా మాత్రం అంతకుమించి ఛాన్సులు అందుకోలేకపోయింది. కానీ ఎప్పుడైతే ఆమె బాలీవుడ్ కి వెళ్ళిపోయిందో అక్కడ మాత్రం చాలా మంచి ఆఫర్లు వచ్చాయి. కేవలం కమర్షియల్ సినిమాలు మాత్రమే కాకుండా పింక్ లాంటి మంచి కంటెంట్ ఉన్న సినిమాలలో కూడా అవకాశాలు అందుకుంది. సినిమాకు అవసరమైతే బికినీలో కూడా దర్శనమిచ్చి మోక్సాఫీస్ వద్ద మంచి కలెక్షన్స్ ను కూడా అందించింది. ఇక బాలీవుడ్ లో అలా కొనసాగుతూ వెళుతున్న తాప్సి అప్పడప్పుడు సోషల్ మీడియాలో కూడా గ్లామర్ తో హీటెక్కిస్తోంది. రీసెంట్గా మరోసారి అమ్మడు తడిసిన పరువాలతో మంత్రముగ్ధులను చేసింది. స్విమ్మింగ్ పూల్ లో చీరలో చీర కొంగును తడిపేసిన అమ్మడు అందులోనే నడుము అందాలను కూడా మరింత అందంగా ప్రజెంట్ చేసింది. ఇక తన మత్తెక్కించే లుక్స్ తో కూడా ఈ భామ ఫాలోవర్స్ కు మతిపోయేలా చేసింది. గతంలో ఇంతకంటే ఘాటైన లుక్స్ లో కూడా కనిపించిన తాప్సి ఇప్పడు మాత్రం అంతకుమించి అనేలా అందంగా ఉంది అంటూ పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంటుంది. సినిమాల అవకాశాలు వస్తున్నా రాకపోయినా కూడా ఈ బ్యూటీ మాత్రం సోషల్ మీడియాలో ఫాలోవర్స్ ను ఎప్పటికప్పుడు తన గ్లామర్ తో అట్రాక్ట్ చేస్తూనే ఉంది. ఇక తెలుగులో తాప్సి సినిమా అవకాశాలు అందుకుని చాలా కాలమే అయింది. తెలుగులో కావాలని చేయడం లేదా అనే కామెంట్స్ కూడా ఆమె చాలా సున్నితంగా సమాధానాలు ఇచ్చింది. ఇక్కడ నటించడానికి తనకు ఎలాంటి అభ్యంతరం లేదు అని మంచి కంటెంట్ ఉన్న కథలు వస్తే చేయడానికి ఎప్పడు సిద్ధమే అని వివరణ ఇచ్చింది. ఇక తాప్సి బాలీవుడ్ లో తక్కువ బడ్జెట్ సినిమాలలో కూడా రెమ్యునరేషన్ తక్కువగా తీసుకుని మరి నటిస్తోంది. వీలైనంతవరకు నటిగా తనను తాను కొత్తగా ప్రజెంట్ చేసుకునేందుకు ప్రయత్నాలు అయితే చేస్తుంది. కానీ గత కొంతకాలంగా మాత్రం అమ్మడికి సరైన విజయాలు బాలీవుడ్ లో కూడా దక్కడం లేదు. ప్రస్తుతమైతే చేతిలో డంకీ సినిమా ఉంది. రాజ్ కుమార్ హీరోని షారుక్ ఖాన్ కాంబినేషన్లో వస్తున్న ఈ సినిమాలో అమ్మడు ఒక ప్రత్యేకమైన పాత్రలో కనిపించబోతోంది. మరి ఈ సినిమా ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో చూడాలి.



# మంచి కాన్సెప్ట్ సినిమాలంటే నాకెంతో ఇష్టం




ఒక తండ్రి తనకొడుకుని సరైన మార్గంలో పెట్టకపోతే ఆ కొడుకు విచ్చల విడిగా సమాజానికి హానికరంగా మారితే... ఆ తండ్రి తీసుకొనే నిర్ణయం ఏమిటి...తండ్రి కొడుకుల మధ్య జరిగే యాక్షన్ ఎంటర్టైనర్ సినిమానే "డర్టీ ఫెలో" శ్రీమతి గుడూరు భద్ర కాళీ సమర్పణలో రాజ్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై శాంతి చంద్ర, దీపిక సింగ్, మిస్ ఇండియా 2022 సిమ్రితి హీరో హీరోయిన్లుగా ఆడారి మూర్తి సాయి దర్శకత్వంలో జి. యస్. బాబు నిర్మించిన ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకొని సెన్సార్ వెళ్లిన సందర్భంగా చిత్ర యూనిట్ పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన హీరో శ్రీకాంత్ చిత్ర టీజర్ ను విడుదల చేశారు. అనంతరం.... హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ.. తల్లి, తండ్రులు, గురువులు పిల్లలను క్రమశిక్షణలో పెంచకపపోతే ఆ పిల్లలు ఏవిధంగా తయారు అవుతారనే కాన్సెప్ట్ నాకు చాలా బాగా నచ్చింది.దర్శకుడు ఆడారి మూర్తి సాయి ఈ సినిమాను చాలా బాగా తీశాడు. టీజర్ కూడా చాలా బాగుంది.చిత్ర హీరో శాంతి చంద్ర బిజినెస్ లో ఎంతో బిజీగా ఉన్నా తనకు సినిమా అంటే ఎంతో ప్యాషన్. ఇలాంటి వారు కచ్చితంగా ఇండస్ట్రీకి రావాలి. అలాగే డాక్టర్ గా ఎంతో బిజీగా ఉన్న సతీష్ కుమార్ గారు ఈ సినిమాకు మ్యూజిక్ చేయడం చాలా గ్రేట్. మంచి కాన్సెప్ట్ తో వస్తున్న ఈ సినిమా బిగ్ హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. చిత్ర దర్శకుడు ఆడారి మూర్తి సాయి మాట్లాడుతూ.. నాయకుడుగా, ప్రతి నాయకుడుగా అతి తక్కువ కాలంలో 125 సినిమాలు పూర్తి చేసుకున్న హీరో శ్రీకాంత్ గారు చేతుల మీదుగా నా సినిమా టీజర్ ను విడుదల చేసుకోవడం చాలా సంతోషంగా ఉంది. మా హీరో శాంతి చంద్ర, దర్శకులు వీరశంకర్,నటీ నటులు, టెక్నిషియన్స్ అందరూ సపోర్ట్ చేయడం వలన ఈ సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మెచ్చే అన్ని అంశాలు ఈ సినిమా లో ఉన్నాయి. అందరికీ కచ్చితంగా నచ్చుతుందని అన్నారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.